RNI No. APTEL/2012/53127

TELANGANA VANI TELUGU DAILY

# తెలంగాణ వాణి

తెలుగు దినపత్రిక | The Voice of Telangana

Published From KARIMNAGAR, HYDERABAD, ADILABAD, NIZAMABAD, WARANGAL, KHAMMAM, NALGONDA,

సంపుటి: 16 | సంచిక: 17 | ఎడిటర్ : జేరిపోతుల సంపత్, కరీంనగర్ | ఆదివారం 19-4-2026 | పేజీలు: 8 | వెల: రూ. 2.00

తెలంగాణ వాణి TELANGANA VANI TELUGU DAILY తెలుగు దినపత్రిక The Voice of Telangana R N I No. APTEL/2012/53127

విలేకరులు కావలెను

తెలంగాణ వాణి దినపత్రికలో పనిచేయుటకు సిటీ బ్యూరో, జిల్లా బ్యూరోలు, నియోజకవర్గం, మండలాలవారీగా అనుభవం కలిగిన రిపోర్టర్లు కావలెను. ఆసక్తిగలవారు ఈ క్రింది నెంబరుకు సంప్రదించగలరు.

9182328292

## స్వార్థ రాజకీయాల కోసం

# నారిశక్తిని అడ్డుకున్నారు

- విపక్షాల పాపాలకు శిక్ష తప్పదని ప్రధాని మోదీ హెచ్చరిక - మహిళలకు జరిగిన అవమానాన్ని మర్చిపోం
- బిల్లుకు మద్దతివ్వకుండా విపక్షాలు చాలా పెద్ద తప్పు చేశాయన్న మోదీ - విపక్షాలు భారీ మూల్యం చెల్లించుకోవడం ఖాయమని వ్యాఖ్య
- బిల్లుకు వ్యతిరేకంగా ఉండటమే కాకుండా సాకులు వెతుకుతున్నారన్న మోదీ



**న్యూఢిల్లీ** మహిళా రిజర్వేషన్ల బిల్లును ఓడించినందుకు కాంగ్రెస్ సహా విపక్ష పార్టీలన్నీ శిక్ష అనుభవించాల్సిందేనని ప్రధాని మోదీ అన్నారు. రాజ్యాంగసవరణ బిల్లు వీగిపోయిన సందర్భంగా ఆయన జాతినుద్దేశించి ప్రసంగించారు. ఈ రోజు నేను ఒక ముఖ్యమైన విషయం గురించి, ముఖ్యంగా ఈ దేశ మహిళల కోసం చర్చించడానికి ఇక్కడ ఉన్నాను. ఈ దేశంలోని ప్రతి పౌరుడు మహిళల పురోగతి ఎలా నిలిచిపోయిందో చూస్తున్నారు, మా శతవిధ ప్రయత్నాల పట్టికీ, మేము విజయం సాధించలేకపోయామని ఆయన తెలిపారు. నారీ శక్తి అధినియంలో సవరణలు చేయలేకపోయాము. దీనికి గాను దేశంలోని తల్లులందరికీ, సోదరీమణులందరికీ నేను క్షమాపణలు కోరుతున్నానని మోదీతెలిపారు. దేశ సంక్షేమమే మాకు మొదటి ప్రాధాన్యత. కానీ, కొంతమందికి దేశ సంక్షేమం కంటే రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమైనప్పుడు, దాని భారాన్ని ఈ దేశ మహిళలే మోయాల్సి వస్తుంది. ఈసారి కూడా అదే జరిగిందని అన్నారు. కాంగ్రెస్, డీఎంకే, టీఎంసీ , సమాజ్ వాదీ పార్టీ వంటి పార్టీల స్వార్థ రాజకీయాల భారాన్ని ఈ దేశ నారీ శక్తి భరించాల్సి వచ్చిందన్నారు.వ్యక్తిగతంగా, కాంగ్రెస్ తన దశాబ్దాల కాలం నాటి తప్పును సరిదిద్దుకుంటుందని, తన పాపాలకు ప్రాయశ్చిత్తం చేసుకుంటుందని నేను ఆశించానని మోదీ అన్నారు. కానీ చరిత్రను లిఖించే అవకాశాన్ని, మహిళలకు అండగా నిలిచే అవకాశాన్ని కాంగ్రెస్ చేజార్చుకుంది. దేశంలోని మెజారిటీ ప్రాంతాల్లో కాంగ్రెస్ తన ఉనికిని కోల్పోయింది. ఒక పరాన్నజీవిలా కాంగ్రెస్ ప్రాంతీయ పార్టీలపై ఆధారపడుతూ తనను తాను బ్రతికించుకుంటోంది. అయితే కాంగ్రెస్ ఆ ప్రాంతీయ పార్టీలు బలపడటం కూడా ఇష్టపడదు. అందుకే, ఈ సవరణను ఆ ప్రాంతీయ పార్టీల చేత వ్యతిరేకింపజేసి, వారి భవిష్యత్తును చీకట్లోకి నెట్టేలా ఒక రాజకీయ కుట్ర పన్నిందని విమర్శించారు.పార్లమెంటులో నారీ శక్తి వందన్ సవరణను వ్యతిరేకించిన పార్టీలకు నేను స్పష్టంగా చెబుతున్నాను మహిళా శక్తిని తక్కువ అంచనా వేస్తున్నారని హెచ్చరించారు. ఇరవై ఒకటవ శతాబ్దపు మహిళలు దేశంలో జరుగుతున్న ప్రతి సంఘటనను నిశితంగా గమనిస్తున్నారనే విషయాన్ని వారు మర్చిపోతున్నారు. మహిళలు వీరి ఉద్దేశాలను అర్థం చేసుకుంటున్నారు, నిజమేంటో వారికి పూర్తి అవగాహన ఉంది. అందుకే, మహిళా రిజర్వేషన్లను వ్యతిరేకించడం ద్వారా ప్రతిపక్షాలు చేసిన ఈ పాపానికి ఖచ్చితంగా శిక్ష అనుభవిస్తారని హెచ్చరించారు.కాంగ్రెస్, ఎస్పీ, డీఎంకే, టీఎంసీ సహా ఇతర పార్టీలు ఇన్నేళ్లుగా ఒకే విధమైన సాకులు చెబుతూ వస్తున్నాయి. ఏవో కొన్ని సాంకేతిక అంశాలను సాకుగా చూపి, మహిళల హక్కులను కాలరాశాయి. ఈ వికృత రాజకీయ పోకడలను, వీటి

2లో..

## ఇరాన్ మమ్మల్ని బ్లాక్‌మెయిల్ చేయలేదు

**- ట్రంప్ కీలక వ్యాఖ్యలు**



న్యూయార్క్ ఒకవైపు హార్మూజ్ జలసంధి, ఇరాన్ నౌకాశ్రయాలను అమెరికా దిగ్బంధించడం, మరోవైపు జలసంధిని మూసివేసినట్లు ఇరాన్ ప్రకటించడం మరోసారి ప్రపంచవ్యాప్తంగా

2లో..

## ఏఐ వినియోగంపై ఆందోళనలు వద్దు

**- సుప్రీంకోర్టు సీజేఐ సూర్యకాంత్ కీలక వ్యాఖ్యలు**



న్యూఢిల్లీ కృత్రిమమేధ (ఏఐ) వినియోగంపై భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ కీలక వ్యాఖ్యలు చేశారు. న్యాయ వ్యవస్థలో ఏఐ వాడకంపై ఆయన సూచనలు చేశారు. ఏఐ విషయంలో

2లో..



# గ్రీన్ స్టీల్ ప్లాంట్‌కు వినతి

### కేంద్రమంత్రి కుమారస్వామిని కలిసిన రేవంత్ రెడ్డి

**న్యూఢిల్లీ** ఢిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బిజీ బిజీగా గడుపుతున్నారు. ఈ సందర్భంగా కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి, కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మలతో రేవంత్ రెడ్డి శనివారం ఉదయం భేటీ అయి చర్చించారు. తెలంగాణలోని బయ్యారంలో గ్రీన్ స్టీల్ ప్లాంట్ నెలకొల్పాలంటూ కేంద్రమంత్రులకు సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఇందుకు సంబంధించిన వినతి పత్రాన్ని కేంద్రమంత్రికి అందించారు. బయ్యారంలో ఉక్కు ప్లాంట్ ఏర్పాటు చేస్తే జరిగే ప్రయోజనాలను వివరించారు. బయ్యారంలో గ్రీన్ స్టీల్ ప్లాంట్ (ఉక్కు పరిశ్రమ) ఏర్పాటు చేయాలని ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్.డి.కుమారస్వామికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. గ్రీన్‌స్టీల్ ప్లాంట్ ఏర్పాటుతో ఉక్కు కొరత తగ్గడంతో పాటు పర్యావరణానికి మేలు కలుగుతుందని తెలిపారు. ఢిల్లీలో కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి.కుమారస్వామి, ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మలతో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి శనివారం ఉదయం సమావేశమయ్యారు.అదే సమయంలో కాంగ్రెస్ సర్కార్ తెలంగాణ రైజింగ్--2047 విజన్‌లో భాగంగా తయారు చేసిన పారిశ్రామిక ప్రతిపాదనలను కూడా కేంద్రమంత్రులకు సీఎం రేవంత్ రెడ్డి అందించి వివరించారు. తెలంగాణలో పాత వాహనాల ద్వారా వచ్చే స్క్రాప్‌తో ఉక్కును రీసైకిల్ చేసే ఫ్యాక్టరీని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అందుబాటులో ఉన్న టెక్నాలజీ, భారీ పరిశ్రమలు, పారిశ్రామిక ఉత్పత్తికి ఉన్న అనుకూలతల కారణంగా దేశ పారిశ్రామిక ఉత్పత్తి లక్ష్యాలకు హైదరాబాద్ నగరం ఒక కేంద్రంగా నిలుస్తుందని కేంద్రమంత్రులకు

2లో..

# మోదీ కుట్రలు ఓడిపోయాయి

**- మహిళా రిజర్వేషన్ల బిల్లు వీగిపోవడంపై ప్రియాంక వ్యాఖ్యలు**
**- మోదీ సర్కార్‌కు తొలి ఓటమి, ప్రజాస్వామ్య విజయమని వెల్లడి**
**- ప్రతిపక్షాలన్నీ ఏకతాటిపైకి వచ్చాయన్న ప్రియాంక గాంధీ**



**న్యూఢిల్లీ** లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ల రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోవడంపై కాంగ్రెస్ అగ్రనేత, వయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా తాజాగా స్పందించారు. ఈ బిల్లు వీగిపోవడాన్ని ప్రజాస్వామ్య విజయంగా ఆమె అభివర్ణించారు. దేశ సమాఖ్య నిర్మాణాన్ని మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నిందని ఆరోపించారు. మహిళలను అడ్డం పెట్టుకుని అధికారంలో కొనసాగాలని కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం చూస్తోందని విమర్శించారు. అయితే ఇప్పటికే ప్రతిపక్షాల తీరుపై ప్రధాని మోదీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే.పార్లమెంటులో శుక్రవారం జరిగిన సంఘటన ప్రజాస్వామ్యానికి దక్కిన గొప్ప విజయమని ప్రియాంక గాంధీ అభివర్ణించారు. సమాఖ్య నిర్మాణాన్ని మార్చేసి..

2లో..



## సింహం బయటకు వస్తుంటే

# గుంటనక్కల గుండెల్లో దడ

**- కేసీఆర్ సభ అనేసరికి ప్రభుత్వం కుట్రలకు తెరలేపుతోందని విమర్శ**

**హైదరాబాద్** సింహం బయటకు వస్తుందంటే గుంటనక్కల గుండెల్లో దడ పుడుతుందని, అందుకే కేసీఆర్ జగిత్యాలలో బహిరంగ సభకు వస్తున్నారంటే రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎన్నో కుట్రలకు తెరలేపుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. జగిత్యాలలో మాజీ మంత్రి జీవన్ రెడ్డిని కేటీఆర్, హరీశ్ రావులు కలిశారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ, కేసీఆర్ సభ పెడతానంటే అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. రేవంత్ రెడ్డి చాలా సిల్లీ పాలిటిక్స్ చేస్తున్నారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ జగిత్యాల సభకు వస్తున్నారంటే రేవంత్ రెడ్డి మేడిగడ్డకు వెళుతున్నారని అన్నారు. రెండున్నరేళ్లలో మేడిగడ్డ వెళ్లేందుకు ముఖ్యమంత్రికి సమయం లేదా అని ప్రశ్నించారు. ఇక్కడ కేసీఆర్ కీలక బహిరంగ సభ జరుగుతుంటే టీవీలల్లో కేసీఆర్‌తో పాటు తన మేడిగడ్డ పర్యటన కూడా చూపించాలని, అలాగే పత్రికల్లో పతాక శీర్షికన కేసీఆర్‌తో పాటు తన వార్త రావాలనే చిల్లర ప్రయత్నం రేవంత్ రెడ్డి చేస్తున్నారని ఆరోపించారు. అలాగే జగిత్యాల వచ్చే రోడ్డు మూడేళ్లలో

2లో..

## హర్మూజ్ మళ్లీ మూసివేత



**టెహ్రాన్** అమెరికాతో ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరాన్ సంచలన నిర్ణయం తీసుకుంది. వ్యూహాత్మకమైన హర్మూజ్ జలసంధిని మళ్లీ మూసివేసింది. హర్మూజ్ పై మళ్లీ కఠిన నియంత్రణ విధిస్తున్నట్లు నేడు ఓ ప్రకటనలో తెలిపింది. తమ ఓడరేవులకు వచ్చే నౌకలపై అమెరికా నేవీ దిగ్బంధనాన్ని కొనసాగించడమే ఈ నిర్ణయానికి కారణమని, ఇచ్చిన మాటను అమెరికా ఉల్లంఘించిందని ఇరాన్ ఆరోపించింది."ఇరాన్ నౌకలకు స్వేచ్ఛా రవాణాను అమెరికా పునరుద్ధరించే వరకు ఈ పరిస్థితిలో మార్పు ఉండదు. హర్మూజ్ జలసంధి కఠినంగా నియంత్రించబడుతుంది" అని ఇరాన్ సైనిక కమాండ్ తమ అధికారిక టెలివిజన్‌లో స్పష్టం చేసింది.ఇజ్రాయెల్-లెబనాన్ కాల్పుల విరమణ ఒప్పందం తర్వాత, కేవలం రెండు

2లో..

## వరంగల్ విమానాశ్రయానికి

# త్వరలో శంకుస్థాపన

### - ఎయిర్‌పోర్టుకు 953 ఎకరాల భూమి సేకరణ



**హైదరాబాద్** వరంగల్ విమానాశ్రయానికి త్వరలో శంకుస్థాపన చేస్తామని తెలంగాణ రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సచివాలయంలో ఎయిర్ పోర్ట్ అథారిటీ సదరన్ రీజియన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజ్‌కిషోర్, ఏవియేషన్ డైరెక్టర్ భరత్ రెడ్డి, ఇతర అధికారులతో విమానాశ్రయాల ఏర్పాటుపై మంత్రి సమీక్ష నిర్వహించారు. వరంగల్, ఆదిలాబాద్, కొత్తగూడెంలో విమానాశ్రయాల నిర్మాణంపై సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ, సాంకేతిక అనుమతులు, మౌలిక వసతుల ఏర్పాటుకు చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ పనులను త్వరితగతిన ముందుకు తీసుకువెళ్లాలని అధికారులకు సూచించారు. వరంగల్ విమానాశ్రయానికి సంబంధించి ఇప్పటికే సుమారు 953 ఎకరాల భూమిని సేకరించి కేంద్రానికి అప్పగించిన విషయాన్ని గుర్తు చేశారు. త్వరలో శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. డిఫెన్స్, సివిల్ ఏవియేషన్, తెలంగాణ ప్రభుత్వం సంయుక్త ఆధ్వర్యంలో ఆదిలాబాద్ విమానాశ్రయ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గతంలో ప్రతిపాదించిన స్థలం విమానాశ్రయ నిర్మాణానికి అనుకూలంగా లేదని కేంద్ర పౌర విమానయాన శాఖ తెలిపిన నేపథ్యంలో, దీనిపై మరింత లోతైన అధ్యయనం చేసి సాధ్యాసాధ్యాలపై నివేదిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

## తెలంగాణలో మండుతున్న ఎండలు

**- కొమురంభీమ్ జిల్లాల్లో 44.6 డిగ్రీల ఉష్ణోగ్రత**



**హైదరాబాద్** తెలంగాణ రాష్ట్రంలో భానుడి భగభగతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం తొమ్మిది గంటల నుంచే బయటకు రాలేని పరిస్థితులు నెలకొన్నాయి. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటాయి. కొమురంభీమ్ జిల్లాలోని కెరమెరిలో అత్యధికంగా 44.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. నిజామాబాద్ జిల్లాలోని మొండోరాలో 44.5 డిగ్రీలు, జగిత్యాల జిల్లా ఎండపల్లిలో 44.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. తెలంగాణలోని అన్ని ప్రాంతాల్లో గత సంవత్సరం ఇదే రోజుతో పోలిస్తే

2లో..

RNI No. APTEL/2012/53127
TELANGANA VANI TELUGU DAILY
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక
The Voice of Telangana
ఆదివారం, ఏప్రిల్ 19, 2026

## ఉపాధి కూలీలకు ఫేస్ హాజరు రద్దు చేయండి

**- సిఐటియు డిమాండ్**



**అరకులోయ** కేంద్రంలో ఉన్న బిజెపి ఎన్ డిఏ కూటమి ప్రభుత్వం ఇటీవల కాలంలో ఉపాధి హామీ పథకం చట్టాన్ని మార్పులు చేసి పేద కూలీల పొట్టలు కొట్టే విధంగా మార్పులు చేసిందని సిఐటియు అల్లూరి జిల్లా సహాయ కార్యదర్శి జె భగత్ రాం తెలిపారు శనివారం మండలంలో పద్మపురం పంచాయతీ దుమ్మగూడ ఉపాధి కూలీలతో కలిసి పని ప్రదేశంలో పెద్ద ఎత్తున నిరసన తెలియజేశారు. పేస్ హాజరు వలన గిరిజన ప్రాంతంలో కూలీలకు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు ఈ విధంగా పని ఉంటే చేసిన కూలి పనికి సక్రమంగా కూలీలు వచ్చే అవకాశం లేదని తెలిపారు

అదేవిధంగా గతంలో కేంద్రం ఇచ్చే వాటా తగ్గించడం వలన రాష్ట్రాలపై భారం పడే అవకాశం ఉందని దీంతో రాష్ట్రాలు ఉపాధి కూలీలు సంబంధించిన పనులు కల్పించడంలో బకాయి కూలీలు చెల్లించడంలో అలసత్వం వహిస్తాయని దీంతో ఉపాధి కూలీలు మనకి దూరమయ్యే అవకాశం ఉందని తెలిపారు కావాలని ఉపాధి చట్టాన్ని ఎత్తివేసేందుకే కేంద్రంలో ఉన్న బిజెపి ఈ కుట్ర చేసిందని తెలిపారు తక్షణం ఉపాధి హామీ పథకాన్ని పాత పద్ధతిలో కొనసాగించాలని డిమాండ్ చేశారు లేకుంటే సిఐటియు ఉపాధి కార్మిక సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసనలు తెలియజేస్తామని కేంద్ర ప్రభుత్వానికి హెచ్చరిక చేశారు.

### ఘనంగా ఆదిత్యల పాఠశాలో

## గ్రాడ్యుయేషన్ డే

**కోదాడ** కోదాడలోని ఆదిత్య పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు గ్రాండ్ గా సెలబ్రేషన్ చేశారు ఇట్టి కార్యక్రమంలో కోదాడ ఎంఈఓ సలీం షరీఫ్ హాజరయ్యా కార్యక్రమాన్ని అనుసరించి పిల్లల్లో నైపుణ్యాన్ని పెంపొందించి స్కిల్స్ ను డెవలప్ చేసి అనేక విధాలుగా పిల్లల్ని అభివృద్ధి బాటలో నడిపించాలని పిల్లలకు తెలియజేశారు తెలియజేశారు ఉపాధ్యాయులు విద్యాభివృద్ధిని చాటుకోవాలని పిల్లలకి తెలియజేశారు ఇట్టి కార్యక్రమంలో పిల్లలు డ్యాన్సులతో పాటలతో అలరించారు

ఇట్టి కార్యక్రమాన్ని ఎంఈఓ ఎంత అభినందించారు పిల్లలకు వేడుక సందర్భంగా అభినందనలు తెలియజేసి సర్టిఫికెట్స్ ప్రధానం చేశారు ఈ వేడుకలో హాజరై పిల్లలకు అభినందనలు తెలిపినందుకుగాను పాఠశాల యజమాన్యం తరఫున కరస్పాండెంట్ అయినది మరియు పాఠశాల సిబ్బంది ఎంఈఓ సలీం షరీఫ్ గారికి ధన్యవాదాలు తెలియజేశారు ఇంటి కార్యక్రమంలో పాఠశాల కర్రీస్పాండెంట్ హైందవి మాట్లాడుతూ పిల్లలకు అన్ని విధాల చదువులకు సంబంధించి ప్రతి ఒక్కటి సమకూర్చి ఆదిత్య స్కూల్ ని అభివృద్ధి బాటలో నడిపిస్తానని ఇట్టి కార్యక్రమంలో వారు తెలియజేశారు ఈ కార్యక్రమంలో టీచర్ల బృందం స్కూల్ కరస్పాండెంట్ అయినది ప్రిన్సిపాల్ గూడూరు అంజని ఇట్టి కార్యక్రమాన్ని గురించి పిల్లలందరికీ తెలియజేశారు ఇట్టి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు

## మేలో మరో పోరు!

**- జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు రంగం సిద్ధం**
**- రాష్ట్ర ఎన్నికల సంఘం సన్నాహాలు**
**- ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని ఉత్తర్వులు**

రాష్ట్రంలో జిల్లా ప్రజాపరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలు (జడ్పీటీసీ), మండల ప్రజాపరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాల (ఎంపీటీసీ) ఎన్ని కలకు రంగం సిద్ధమైంది. ఓటర్ల జాబితా: లను సిద్ధం చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. పరిస్థితులన్నీ అనుకూలిస్తే మే నెలలో ఎన్నికలు జరిగే అవకాశముంది.

10.07.2025 నుండి 05.02.2026 వరకు కేంద్ర ఎన్నికల సంఘం నవీకరించినజాబితాలో నియోజకవర్గాల్లోని అదనపు ఓటర్ల వివరాలను మండలాల వారీగా గుర్తించి, వాటిని సంబంధిత పంచాయతీ, పోలింగ్ కేంద్రాల వారీగా ఉన్న జాబితా లకు జత చేయాలని హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి మినహా అన్ని జిల్లాల కలెక్టర్లను రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. వీటి ఆధారంగా ఎంపీటీసీ, జడ్పీటీసీల పరిధిలోని గ్రామపంచాయ తీలు, పోలింగ్ స్టేషన్ల వారీగా కొత్త జాబి తాలు రూపొందించాలని తాజాగా ఉత్తర్వులు ఇచ్చింది.

ఈ జాబితాలను జిల్లా పంచాయతీ అధికారి ధ్రువీకరణ తర్వాత, సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ) యూజర్ మాన్యువల్ సూచనల ప్రకారం పోలింగ్ కేంద్రాలకు అనుసంధానించాలని పేర్కొంది. ఆ డేటాలో ఏవైనా వ్యత్యాసా లున్నట్లు గమనిస్తే, వాటిని ఈ నెల 23వ తేదీలోపు ఎన్నికల సంఘానికి నివేదించా లని సూచించింది.

వాటిని ఆమోదించిన తర్వాత ముసాయిదా జాబితాలను గ్రామాల వారీగా విడుదల చేస్తారు. అభ్యంతరాలు, సలహాలు, సూచనలు పరి గణనలోకి తీసుకొని తుది జాబితా విడు దల చేస్తారు. ఆ తర్వాత పోలింగ్ కేంద్రాలు, బ్యాలెట్ బాక్స్ లు , ఇతర ఏర్పాట్లు చేస్తారు.

### మహిళా సాధికారతకు

## కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది

**- రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి**

**విజయవాడ** విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీకనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్న అనంతరం రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మహిళా సాధికారతపై తన అభిప్రాయాలను వెల్లడించారు.

మహిళా బిల్లు పార్లమెంట్లో ఆమోదం పొందితే మహిళలకు రాజకీయంగా మరింత బలం చేకూరేదని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు. శనివారం మంత్రి పుట్టినరోజు సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి కనకదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి కి ఆలయ ఈవో వీకే శీనా నాయక్ స్వాగతం పలకగా ఆలయ పండితులు ఆశీర్వచనాలు అందించి ప్రత్యేక పూజలు అనంతరం ప్రసాదం అందజేశారు. అనంతరం మంత్రి కొలుసు పార్థ సారథి మీడియాతో మాట్లాడుతూ... తన పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన అభిమానులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. మహిళా సాధికారత దిశగా మహిళా బిల్లు కీలకమని, అది ఆమోదం పొందుతుందని ఆశించామని చెప్పారు. ఆ బిల్లు ఆమోదం పొందితే తన పుట్టినరోజు మరింత ఆనందంగా ఉండేదని అభిప్రాయపడ్డారు.
అయితే కూటమి నాయకత్వంలో ఆ బిల్లు ఆమోదం పొందకపోవడం బాధాకరమని మంత్రి పేర్కొన్నారు. మహిళల రాజకీయ సాధికారతకు అడ్డంకులు కలగడం సమంజసం కాదని అన్నారు. మహిళా సాధికారతకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో మహిళల అభివృద్ధి, సాధికారతకు తమ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని మంత్రి స్పష్టం చేశారు.

## సింహం బయటకు వస్తుంటే గుంటనక్కల గుండెల్లో దడ

గుర్తుకు రాలేదు కానీ, ఇప్పుడు కేసీఆర్ సభ అనేసరికి రోడ్డును తవ్విస్తున్నారని మండిపడ్డారు. కోరుట్ల నుంచి ఎవరూ రాకుండా తవ్విస్తున్నారని ఆరోపించారు. గతంలో ఎన్నో బహిరంగ సభలు జరిగాయని, ఇప్పుడు కూడా విజయవంతమవుతుందని ధీమా వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి హైట్ మాత్రమే చిన్నది కాదని మెదడు కూడా చిన్నదేనని ఎద్దేవా చేశారు. కాగా, ఎల్లుండి జగిత్యాలలో జరగనున్న బహిరంగ సభలో జీవన్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీలో చేరనున్నారు.

## హర్మ్యూజ్ మళ్లీ మూసివేత

రోజుల క్రితమే ఇరాన్ ఈ జలసంధిని తెరిచింది. అయితే, ఇరాన్‌తో విస్తృత ఒప్పందం కుదిరే వరకు నేవీ దిగ్బంధనం కొనసాగుతుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేయడంతో పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. పర్షియన్ గల్ఫ్ నుంచి ఆయిల్ ఎగుమతులకు హర్మ్యూజ్ జలసంధి ప్రధాన మార్గం. ప్రపంచ ఆయిల్ రవాణాలో దాదాపు 20 శాతం ఇక్కడి నుంచే జరుగుతుంది. ఇరాన్ తాజా నిర్ణయంతో మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు మళ్లీ పెరిగే అవకాశం ఉందని, ఇది ప్రపంచ ఆయిల్ ధరలపై ప్రభావం చూపే ప్రమాదం ఉందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## తెలంగాణలో మండుతున్న ఎండలు

ఉష్ణోగ్రతలు మూడు నుంచి నాలుగు డిగ్రీలకు పైగా పెరిగాయి. గత సంవత్సరం ఇదే రోజున అత్యధిక ఉష్ణోగ్రత 43.4 డిగ్రీలు కాగా, ఈ సంవత్సరం శనివారం 44.6 డిగ్రీలుగా నమోదైంది. రోజురోజుకు ఎండలు పెరుగుతున్నందున చిన్నారులు, వృద్ధులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ శాఖ సూచించింది. అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని కోరింది.

### దళితుల ఆత్మగౌరవాన్ని

## గాయపరిచే ఏ ఒక్కడినీ వదలం

**సామాజిక సంక్షేమ బోర్డు చైర్మన్ పోతుల బాలకోటయ్య హెచ్చరిక**

సోషల్ మీడియాలో నోటికొచ్చినట్లు వ్యక్తిత్వ హననం చేస్తూ, దళితుల ఆత్మగౌరవాన్ని నీచమైన పదజాలాలతో కించపరిచే సోషల్ మీడియా రాబందులను ఏ ఒక్కడినీ వదలబోమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సామాజిక సంక్షేమ బోర్డు చైర్మన్ పోతుల బాలకోటయ్య హెచ్చరించారు. శనివారం ఆయన మీడియాకు ప్రకటన విడుదల చేశారు. ఇటీవల సంక్షేమ బోర్డును ముష్టి బోర్డుగా, ఎస్సీ, ఎస్టీ ఆత్మగౌరవాన్ని కించపరుస్తూ వైకాపా నాయకులు పెట్టిన పోస్ట్ పై తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఎస్సీ సామాజిక కులాలపై పరుష పదజాలంతో దాడి చేసిన వారిని రెండు, మూడు రోజుల్లో చట్టం ముందుకు తీసుకురానున్నట్లు స్పష్టం చేశారు. ఇప్పటికే సోషల్ మీడియాలో అభ్యంతరకరమైన పోస్ట్ ల పట్ల ప్రభుత్వం చాలా కఠినంగా వ్యవహరించాలన్న నిర్ణయం తీసుకున్నట్లు గుర్తు చేశారు. రాష్ట్రంలో అణగారిన కులాల ఆత్మగౌరవాన్ని భంగపరిచే సామాజిక వైషమ్యకారులపై కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని బాలకోటయ్య అభిప్రాయపడ్డారు

## జలసంరక్షణ మనందరి బాధ్యత

**- ఎమ్మెల్యే ఆరణి.**



జల సంరక్షణ మనందరి బాధ్యత అని, ఆ దిశగా అందరూ కృషి చేయాలని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర లో భాగంగా శనివారం చెన్నారెడ్డి కాలనిలోని కృష్ణమ నాయుడు పుష్కరిణి జలధార - జల హారతి కార్యక్రమాన్ని నిర్వహించి హారతులు సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి శనివారం రాష్ట్ర ప్రభుత్వం పిలుపు మేరకు జలధార - జల హారతి కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. ప్రతి శనివారం ఒక నినాదంతో ముందుకు వచ్చి ప్రజల్లో శుభ్రతపై చైతన్యం కలిగితున్నామని తెలుప్పారు. ఈ నెల వర్షపు నీటి పరిరక్షణ, ఇంకుడు గుంతల ఏర్పాటు, భూగర్భ జలాల పరిరక్షణ పై ప్రజలకు అవగహన కల్పిస్తున్నామని తెలిపారు. స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర లో అందరూ భాగస్వాములై పరిసరాల పరిశుభ్రతతో పాటు ఇండ్లు కూడా శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. అదనపు కమిషనర్ శారదా దేవి మాట్లాడుతూ నీటి పరిరక్షణతో మానవ మనుగడ సాధ్యమని, నీరు ఎక్కడ అందుబాటులో ఉంటే అక్కడ అభివృద్ధి జరిగితుందని తెలిపారు. భూగర్భ జలాల పెంపు, వర్షపు నీటిని నిల్వ చేసేందుకు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. వీటిపై అవగాహన కల్పిస్తూ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో కృష్ణమ నాయుడు పుష్కరిణిలో జలధార - జలహారతి కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. వేసవిలో నీటిని వృధా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపుకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, మాజీ డిప్యూటీ మేయర్ ఆర్.సి.మునికృష్ణ, నరేంద్ర, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవిన్యూ అధికారులు సేతు మాధవ్, రవి, హార్టికల్చర్ ఆఫీసర్ హరికృష్ణ, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులు, సిబ్బంది, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఏకకాలంలో పాన్ షాపులు, కిరాణా దుకాణాలలో పోలీసుల తనిఖీలు



**హైదరాబాద్** నగర పోలీస్ కమిషనర్ విసీ సజ్జనార్ ఆదేశాల మేరకు నగరంలోని పాన్ షాప్ లు, కిరాణాదుకాణాలలో పోలీసులు ఏక కాలంలో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. బ్యాండ్ చేసిన నిషేధితమైన గుట్కా ప్యాకెట్లను సిగరెట్ డబ్బాలతో పాటు మరికొన్ని వస్తువులు అక్రమంగా అమ్ముతుండడంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు.ముఖ్యంగా స్కూల్ సమీపంలో ఉన్న పాన్ షాపులను టార్గెట్ చేసి వారి వద్ద నుండి పెద్ద ఎత్తున గుట్కాలు పాన్ మసాలాలు స్వాధీన పరుచుకొని వారిపై కేసులు నమోదు చేశారు.నిషేధిత మరక ద్రవ్యాలు,గుట్కాలు,పాన్ మసాలాలు సెల్ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సజ్జనార్ హెచ్చరించారు.

## స్వార్థ రాజకీయాల కోసం నారిశక్తిని అడ్డుకున్నారు

వెనుక ఉన్న అసలు కారణాలను దేశం ఇప్పటికే అర్థం చేసుకుందని ప్రధాని మోదీ అన్నారు. నారీ శక్తి వందన్ అధినియాన్ని వ్యతిరేకించడం వెనుక ఒక బలమైన కారణం ఉంది - అదే ఈ వారసత్వ పార్టీల భయం. మహిళలు గనుక సాధికారత సాధిస్తే, తమ వారసత్వ రాజకీయాల నాయకత్వానికి ముప్పు వాటిల్లుతుందని ఈ పార్టీలు వణికిపోతున్నాయి. తమ కుటుంబాలకు చెందని మహిళలు రాజకీయాల్లో ఎదిగి, ముందుకు రావడాన్ని ఇవి ఎన్నటికీ సహించలేవన్నారు. ఈ పార్టీలు రాజ్యాంగ నిర్మాతల ఆశయాలను కూడా అవమానించాయి, ఈ పాపానికి గాను ప్రజలు ఇచ్చే శిక్ష నుండి వీరు తప్పించుకోలేరని మోదీ అన్నారు. నారీ శక్తి వందన్ సవరణ అనేది ఎవరి దగ్గరో ఏదో లాక్కోవడం కోసం తెచ్చింది కాదు, అందరికీ ఏదో ఒకటి ఇవ్వడం కోసం ఉద్దేశించింది. గత 40 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న హక్కులను మహిళలకు కల్పిస్తూ, 2029 ఎన్నికల నాటికి వారిని సాధికారత వైపు నడిపించడమే దీని లక్ష్యం. వారి ప్రగతి పథంలో ఉన్న అడ్డంకులను తొలగించేందుకు చేపట్టిన ఒక 'మహాయజ్ఞం' ఇది. ప్రస్తుత తరుణంలో నారీ శక్తి వందన్ సవరణ దేశానికి ఎంతో అవసరమని గుర్తుచేశారు. కాంగ్రెస్ , దాని మిత్రపక్షాలు పార్లమెంటులో అందరి కళ్ల ముందే ఈ బృహత్తర ప్రయత్నాన్ని భ్రూణహత్య చేశాయి. కాంగ్రెస్, టీఎంసీ, సమాజ్ వాదీ పార్టీ, డీఎంకే వంటి పార్టీలే దీనికి బాధ్యులు. ఈ దేశ నారీ శక్తి పట్ల అపరాధులుగా వీరు మిగిలిపోతారని మోదీ స్పష్టం చేశారు.మహిళా రిజర్వేషన్ల అంశంపై కాంగ్రెస్ ద్వేషపూరితంగా వ్యవహరిస్తోంది, దీనిని అడ్డుకునేందుకు ఎల్లప్పుడూ కుట్రలు చేస్తూనే ఉంది. గతంలో ఎప్పుడు ఈ దిశగా ప్రయత్నాలు జరిగినా, కాంగ్రెస్ ఏదో ఒక రూపంలో అడ్డంకులు సృష్టించింది. ఈసారి కూడా కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు అబద్ధపు ప్రచారాలతో ఈ ప్రక్రియను ఆపేందుకు యత్నించాయి. తద్వారా వారు యావత్ దేశాన్ని తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని మోదీ విమర్శించారు. నియోజకవర్గాల పునర్విభజన అంశంపై కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు నిరంతరం అబద్ధాలను ప్రచారం చేస్తున్నాయని మోదీవిమర్శించారు. ఈ సాకుతో దేశంలో విభజన సెగలు రాజేయాలని అవి ప్రయత్నిస్తున్నాయి. బ్రిటిష్ వారి నుంచి వారసత్వంగా పొందిన విభజించి పాలించు రాజకీయాన్నే కాంగ్రెస్ నేటికీ అనుసరిస్తోందని మోదీ మండిపడ్డారు. దేశంలో చీలికలు తెచ్చే భావోద్వేగాలను రెచ్చగొట్టడమే కాంగ్రెస్ నైజం. పునర్విభజన వల్ల కొన్ని రాష్ట్రాలు నష్టపోతాయనే తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేశారు. అయితే, ఏ రాష్ట్ర ప్రాతినిధ్యం తగ్గదని, రాష్ట్రాల సీట్ల నిష్పత్తిలో మార్పు ఉండదని ప్రభుత్వం మొదటి రోజు నుంచే స్పష్టం చేస్తూ వస్తోంది. అన్ని రాష్ట్రాల సీట్లను సమాన నిష్పత్తిలో పెంచడం జరుగుతుంది. అయినప్పటికీ, కాంగ్రెస్, డీఎంకే, టీఎంసీ, ఎస్పీ వంటి పార్టీలు ఈ వాస్తవాన్ని అంగీకరించడానికి సిద్ధంగా లేవని విమర్శించారు.ఈ సవరణ బిల్లు అన్ని రాజకీయ పార్టీలకు , రాష్ట్రాలకు ఒక గొప్ప అవకాశమని మోదీ గుర్తు చేశారు. ఒకవేళ ఈ బిల్లు ఆమోదం పొంది ఉంటే తమిళనాడు, బెంగాల్, ఉత్తరప్రదేశ్, కేరళతో పాటు ప్రతి రాష్ట్రంలోనూ సీట్ల సంఖ్య పెరిగేది. కానీ తమ స్వార్థ రాజకీయాల కోసం ఈ పార్టీలు సొంత రాష్ట్ర ప్రజలకే ద్రోహం చేశాయి. తమిళనాడు నుంచి మరింత మంది తమిళులను ఎంపీలు, ఎమ్మెల్యేలుగా పంపే అవకాశం డీఎంకేకు ఉండేది, తద్వారా తమిళనాడు గొంతుక మరింత బలోపేతం అయ్యేది. కానీ ఆ అవకాశాన్ని వారు చేజార్చుకున్నారు. అదేవిధంగా బెంగాల్ ప్రజలను ముందుకు నడిపించే అవకాశం టీఎంసీకి లభించినా, ఆ పార్టీ దానిని వినియోగించుకోలేకపోయింది. అటు సమాజ్ వాదీ పార్టీ తనకున్న మహిళా వ్యతిరేక ముద్రను చెరిపేసుకునే అవకాశం వచ్చినప్పటికీ, దానిని వదులుకుంది. ఎస్పీ ఇప్పటికే లోహియా ఆశయాలను మరిచిపోయింది. నారీ శక్తి వందన్ సవరణను వ్యతిరేకించడం ద్వారా లోహియా గారి కలలను ఎస్పీ చిదిమేసింది. ఎస్పీ మహిళా రిజర్వేషన్లకు వ్యతిరేకమని, ఉత్తరప్రదేశ్ . దేశవ్యాప్తంగా ఉన్న మహిళలు ఈ విషయాన్ని ఎన్నటికీ మర్చిపోరని మోదీ స్పష్టం చేశారు. మహిళా రిజర్వేషన్లను వ్యతిరేకించడం ద్వారా కాంగ్రెస్ పార్టీ తాము సంస్కరణలకు వ్యతిరేకమని మరోసారి నిరూపించుకుంది. 21వ శతాబ్దపు 'వికసిత భారత్' నిర్మాణానికి అవసరమైన ప్రతి నిర్ణయాన్ని, ప్రతి సంస్కరణను కాంగ్రెస్ అడ్డుకుంటోంది. దేశం తీసుకుంటున్న ప్రగతిశీల నిర్ణయాలను ఆ పార్టీ తిరస్కరించడమే కాకుండా, వాటికి అడ్డంకులు సృష్టిస్తోంది. కాంగ్రెస్ చరిత్ర అంతా ఇటువంటి ప్రతికూల రాజకీయాలతోనే నిండి ఉందని గుర్తు చేశారు.

## ఇరాన్ మమ్మల్ని బ్లాక్‌మెయిల్ చేయలేదు

చమురు ఆందోళనలకు కారణమైంది. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. హర్మ్యూజ్ జలసంధిని మూసివేయడం ద్వారా ఇరాన్ తమపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నం చేస్తోందని, కానీ ఇలాంటి వాటిని ఉపేక్షించేది లేదని అన్నారు.ఇరాన్ తమను బ్లాక్‌మెయిల్ చేయలేదని హెచ్చరించారు. "టెహ్రాన్ దశాబ్దాలుగా ఇలాగే వ్యవహరిస్తోంది. కానీ వారు మమ్మల్ని బ్లాక్ మెయిల్ చేయలేరు" అని వైట్ హౌస్ లో విలేకరుల సమావేశంలో ట్రంప్ అన్నారు. ఇరుపక్షాల మధ్య చర్చలు కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. ఇరాన్‌తో సంప్రదింపులు కొనసాగుతున్నాయని తెలిపారు. రోజు ముగిసే సమయానికి సంప్రదింపులకు సంబంధించి కొంత సమాచారం లభిస్తుందని వెల్లడించారు. హర్మ్యూజ్ జలసంధిని తెరుస్తున్నట్లు ఇరాన్ తొలుత ప్రకటించింది. ఇరవై నాలుగు గంటలు తిరగక ముందే తిరిగి మూసివేస్తున్నట్లు ప్రకటించింది. తమ ఓడరేవుల చుట్టూ అమెరికా తన దిగ్బంధనాన్ని కొనసాగిస్తున్నందువల్లే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఇరాన్ తెలిపింది.

## ఏఐ వినియోగంపై ఆందోళనలు వద్దు

ఆందోళనలు వద్దని అన్నారు. న్యాయవ్యవస్థలో సాంకేతిక పరిజ్ఞానాన్ని స్వీకరించాలంటే అంతర్గత పరిమితులపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని అన్నారు. కర్ణాటక రాష్ట్ర స్టేట్ జ్యుడిషియల్ ఆఫీసర్స్ అసోసియేషన్ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, సాంకేతికత అనేది సలహాలు ఇవ్వడంలో ఉపయోగపడుతుందని అన్నారు. ఏఐ మనుషులకు ఏమాత్రం ప్రత్యామ్నాయం కాదని గుర్తించాలని వ్యాఖ్యానించారు. న్యాయవ్యవస్థలో ఏఐ అనుసంధానం చేయాలంటే సమతౌల్యత పాటించాలని అన్నారు.క్లిష్టమైన ప్రశ్నలతో కూడిన ఓ కేసు మీ ముందుకు వస్తే, ఆ సమస్యను పరిష్కరించడానికి మీరు సమయం వెచ్చించి ఆలోచిస్తారని, దానిని పరిష్కరించాక మీరు గొప్ప అనుభూతిని పొందుతారని ఆయన అన్నారు. ఇలాంటి విషయాల్లో ఏఐ సామర్థ్యం సరిపోకపోవచ్చని అభిప్రాయపడ్డారు. కాబట్టి ఏఐ గురించి ఆందోళన అవసరం లేదని అన్నారు. న్యాయాధికారులు ఉత్పాదకతను పెంచడానికి తగిన శిక్షణ తీసుకుంటారని, శ్రద్ధతో పనిచేస్తారని అన్నారు. కానీ ఏఐ డేటా ఆధారంగా పనిచేస్తుందని గుర్తు చేశారు. మనుషులకు ఉండే విచక్షణ శక్తి ఏఐకి ఉండదని, నిర్ణయాలు తీసుకునే సమయంలోనూ మనుషుల్లా ఆలోచించదని తెలిపారు. కేసులను పరిష్కరించడానికి నైతిక విలువలు, సామాజిక కోణాలు, రాజ్యాంగ నియమాలు, విలువల కట్టుబాటు ఉంటాయని, కానీ ఎలాంటి భావోద్వేగాలు లేని ఏఐ వల్ల ఇది సాధ్యం కాదని అన్నారు.

## గ్రీన్ స్టీల్ ప్లాంట్‌కు వినతి

రేవంత్ రెడ్డి వెల్లడించారు.అదే సమయంలో హైడ్రోజన్ టెక్నాలజీతో గ్రీన్ స్టీల్ క్లస్టర్, ఆటో, రక్షణ రంగాలకు అవసరమైన ఉత్పత్తుల తయారీ పరిశ్రమలు ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ)కొనుగోళ్లు భారీగా పెరుగుతున్న నేపథ్యంలో హైదరాబాద్‌లో ఈవీ బ్యాటరీల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కేంద్రమంత్రులు కుమారస్వామి, శ్రీనివాస వర్మలను సీఎం రేవంత్ రెడ్డి కోరారు. మరోవైపు మెషిన్ టూల్స్, రోబోటిక్స్ వంటి అత్యాధునిక పరికరాల తయారీకి స్పెషల్ పార్క్‌ను కూడా ఏర్పాటు చేయాలని కేంద్రమంత్రులకు సీఎం విజ్ఞప్తి చేశారు.

2034 నాటికి హైదరాబాద్‌ను కాలుష్య రహిత నగరంగా మార్చే లక్ష్యంతో వాహనాలను ఎలక్ట్రిక్ వెహికల్స్‌గా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వానికి సహకరించాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. అత్యాధునిక పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు అవసరమైన స్కిల్స్‌ను నేర్పించే నేషనల్ లెవల్ సంస్థలను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయాలని కేంద్రమంత్రులకు రేవంత్ రెడ్డి సూచించారు.

## మోదీ కుట్రలు ఓడిపోయాయి

ప్రజాస్వామ్యాన్ని బలహీనపరచాలనే మోదీ సర్కార్ కుట్ర ఓడిపోయిందని పేర్కొన్నారు. ఇది రాజ్యాంగానికి, దేశానికి, ప్రతిపక్షాల ఐక్యతకు లభించిన విజయంగా ఆమె పేర్కొన్నారు. ఈ ఓటమి అధికార పార్టీ నేతల ముఖాల్లో స్పష్టంగా కనిపించిందని తెలిపారు.ఏదో రకంగా అధికారంలో ఉండాలనేది ఎన్డీఏ సర్కార్ కుట్ర అని అందుకే మహిళలను ఉపయోగించుకుని శాశ్వతంగా అధికారంలో ఎలా ఉండాలో ప్లాన్ చేస్తున్నారని ఆరోపించారు.

లోక్‌సభలో బిల్లు ఆమోదం పొందితే తాము గెలుస్తామని ఒక వేళ ఆమోదం పొందకపోతే ప్రతిపక్షాలను మహిళా వ్యతిరేకులుగా ముద్రవేసి వారే మహిళా రక్షకులుగా ప్రచారం చేసుకోవాలని మోదీ సర్కార్ భావించిందని మండిపడ్డారు.ఈ నేపథ్యంలోనే 2023లో అన్ని పార్టీల మద్దతుతో ఏకగ్రీవంగా ఆమోదించబడిన మహిళా రిజర్వేషన్ల బిల్లును తిరిగి తీసుకురావాలని ప్రియాంక గాంధీ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పుడే మహిళలకు హక్కులు కల్పించండి అని పేర్కొన్నారు. డీలిమిటేషన్ వంటి ఇతర అంశాలతో మహిళా రిజర్వేషన్ల బిల్లును ముడిపెట్టి తప్పుదోవ పట్టించకండి అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ ఓటమిని ప్రభుత్వానికి ఒక గట్టి షాక్‌గా అభివర్ణించిన ప్రియాంకా గాంధీ కేవలం ప్రచారం, మీడియా హైప్ ఇకపై పని చేయవని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే మహిళా రిజర్వేషన్లకు తాము వ్యతిరేకం కాదని తేల్చి చెప్పిన ప్రతిపక్షాలు కానీ దాన్ని నియోజక వర్గాల పునర్విభజన (డీలిమిటేషన్), జనాభా గణనతో ముడిపెట్టడాన్ని మాత్రమే వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశాయి.

RNI No. APTEL/2012/53127

## బైంసాలో అర్ధమండల హనుమాన్ మాలధారణ



నిర్మల్ – భైంసా (తెలంగాణ వాణి ప్రతినిధి) నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలోని గణేష్ నగర్ మున్నూరు కాపు సంఘం భవనంలో అర్ధమండల హనుమాన్ స్వాముల మాలధారణ కార్యక్రమం ఘనంగా జరిగింది. మున్సిపల్ చైర్మన్ తుమోళ్ళ దత్తు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి హనుమాన్ దీక్ష పీఠాధిపతి శ్రీ శ్రీ దుర్గాప్రసాద్ స్వామీజీ సాన్నిధ్యం వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ముధోల్ నియోజక వర్గ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ స్వామీజీ ఆశీర్వచనాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. భక్తి భావం మనిషిలో ధైర్యం,నైతిక విలువలను పెంచుతుందని తెలిపారు. పెద్ద సంఖ్యలో హనుమాన్ స్వాములు, భక్తులు పాల్గొని మాలధారణ చేసి స్వామి దీవెనలు పొందారు. కార్యక్రమం భక్తి పరవశంతో సాగింది.

## ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి: టిటియు.



ఎల్లారెడ్డి (తెలంగాణ వాణి ప్రతినిధి) టిజిఇజెఎసి పిలుపు మేరకు నేడు కొట్టాల్ లో తెలంగాణ టీచర్స్ యూనియన్ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఎండీ ముజిబొద్దీన్ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జి ధరించి నిరసన తెలపడం జరిగింది. ఆయన మాట్లాడుతూ 51శాతం ఫిట్ మెంట్ తో పిఆర్సి వెంటనే అమలు పరచాలని, సి.పి.ఎస్. రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, అన్ని రకాల పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని, 2010 సం.కు ముందు గల ఇన్ సర్వీసు ఉపాధ్యాయులకు చెట్ (టెట్ ) మినహాయింపు ఇవ్వాలని, ఎంప్లాయిస్ హెల్త్ కార్డులను ఇవ్వాలని, మిగిలిన అపరిష్కృత 64 సమస్యలను పరిష్కరించాలని ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. దీంట్లో ఉపాధ్యాయురాలు పాల్గొన్నారు.

## వాహన దారులు రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటించాలి

**బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ...**



కుత్బుల్లాపూర్ (తెలంగాణ వాణి) ప్రజల ప్రాణాలను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అనే లక్ష్యంతో రాష్ట్ర రోడ్డు, రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రోడ్ భద్రతా వారోత్సవాలను పురస్కరించుకొని, వాహనదారులు రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటించి వారు సురక్షితంగా ఉండటంతో పాటు తోటి వారిని సురక్షితంగా ఉంచాలని బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ పత్రిక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాహనదారులు ప్రతీ ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటించాలని, వాహనాన్ని నడిపేటపుడు హెల్మెట్ , సీట్ బెల్ట్ ను తప్పని సరిగా వినియోగించాలన్నారు. మద్యం సేవించి వాహనం నడపకూడదని, వాహనాలను వేగంగా నడపడం వల్ల మీరు మాత్రమే కాదని, తోటి వాహనదారులు, పాదాచారులు ప్రమాదాలకు గురయ్యే ప్రమాదం ఉందన్న ఆయన ప్రతి పౌరుడు ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించడం సురక్షితంగా తమ గమ్యానికి చేరుకోవాలన్నారు.

## దళిత రత్న అవార్డు అందుకున్న నీరటి శ్రీనివాస్‌కు ఘన సన్మానం...



వేములవాడ,ఏప్రిల్ 18 (తెలంగాణ వాణి ప్రతినిధి) : గత 16 ఏళ్లుగా దళిత, బహుజన మరియు ప్రజా ఉద్యమాల్లో నిరంతర సేవలు అందిస్తున్న రాజన్న సిరిసిల్ల జిల్లా దళిత నాయకుడు నీరటి శ్రీనివాస్‌కు ప్రతిష్టాత్మక 'దళిత రత్న' అవార్డు ను హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి ఉత్సవాల సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఉత్సవ కమిటీ కో-కన్వీనర్ డాక్టర్ అల్లిబిల్లి మహేందర్ చేతుల మీదుగా శ్రీనివాస్ ఈ అవార్డును అందుకున్నారు.అవార్డు గ్రహీత నీరటి శ్రీనివాస్ వేములవాడకు చేరుకున్న సందర్భంగా అంబేద్కర్ జేఏసీ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో శ్రీనివాస్ ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ గత దశాబ్దంన్నర కాలంగా దళిత, బహుజన వర్గాల హక్కుల కోసం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం శ్రీనివాస్ చేసిన కృషి అభినందనీయమని కొనియాడారు. ఆయన సేవలను గుర్తించి దళిత రత్న అవార్డు ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.?ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు సిరిగిరి శ్రీకాంత్, మూడపల్లి నాగరాజుతో పాటు నాయకులు మేట్ల దేవానంద్, చేర్ల రమేష్, గుడిసె మనోజ్, అంబేద్కర్ ఉత్సవ కమిటీ కో-కన్వీనర్లు కిషోర్ మూలే,జింక శ్రీధర్,చందుర్తి మండల అధ్యక్షులు హాసినిపర్తి ఏసు కుమార్, చేర్ల సుధీర్, నిరటి కిరణ్ కుమార్, అడ్వకేట్ గుడిసె అరుణ్, పాస్టర్ రవి కుమార్, మన్నే నాగేష్,భరత్ తదితరులు పాల్గొన్నారు.

# 131వ రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోవడం ప్రజాస్వామ్య విజయమే

**మహిళల హక్కుల పేరుతో రాజకీయ ఎత్తుగడలు విఫలం**

**అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సమైక్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంగల రాగసుధ**



నర్సంపేట (తెలంగాణ వాణి ప్రతినిధి) 131వ రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోవడాన్ని స్వాగతిస్తూ, దీనిని ప్రజాస్వామ్య శక్తుల విజయంగా అభివర్ణించవచ్చని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సమైక్య ( ఎ ఐ ఎఫ్ డి డబ్ల్యూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంగల. రాగసుధ అన్నారు. నర్సంపేట పట్టణంలోని మార్క్స్ కాలనీ లో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సమైక్య (ఎ ఐ ఎఫ్ డి డబ్ల్యూ)ముఖ్య కార్యకర్తల సమావేశం ఎ ఐ ఎఫ్ డి డబ్ల్యూ జిల్లా కమిటి సభ్యురాలు జన్ను ,విజయ అధ్యక్షతన జరిగింది.ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంగల. రాగసుధ మాట్లాడుతూ మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పిస్తామని ప్రకటిస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ బిల్లు, వాస్తవానికి మహిళల సాధికారత కోసం కాకుండా రాజకీయ ప్రయోజనాల కోసం రూపొందించబడిందని, ముఖ్యంగా ఈ బిల్లును డీలిమిటేషన్ ప్రక్రియతో అనుసంధానం చేయడం ద్వారా మహిళల హక్కులను అమలు చేయడంలో అనవసరమైన ఆలస్యం సృష్టించబడిందని అన్నారు. ఈ బిల్లు వీగిపోవడం ద్వారా కేంద్ర ప్రభుత్వ ద్వంద్వ వైఖరి, మహిళల పేరుతో చేస్తున్న రాజకీయ ఎత్తుగడలు బహిర్గతమయ్యాయని, మహిళల హక్కులను నిజంగా అమలు చేయాలనే సంకల్పం ప్రభుత్వానికి లేకపోవడం స్పష్టమైందని అన్నారు. దేశంలో మహిళలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు – హింస, అసమానతలు, ఆర్థిక కష్టాలు రోజురోజుకీ పెరుగుతున్నాయని, ఇలాంటి సమయంలో మహిళలకు తక్షణ రాజకీయ ప్రతినిధిత్వం అవసరం. కానీ కేంద్ర ప్రభుత్వం మాత్రం వాగ్దానాలు చేస్తూ వాటిని అమలు చేయడంలో విఫలమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం దేశంలోని మహిళలను అవమాన పరిచే విధానాలను మానుకొని తక్షణమే మహిళా రిజర్వేషన్‌ను ఎటువంటి షరతులు లేకుండా తక్షణమే అమలు చేయాలని, డీలిమిటేషన్ వంటి ప్రక్రియలతో మహిళా హక్కులను అనుసంధానం చేయకూడదని,మహిళల సాధికారతకు స్పష్టమైన మరియు కాలపరిమితి గల కార్యాచరణ ప్రణాళికను ప్రకటించాలని అన్నారు. మహిళల పేరుతో రాజకీయ లాభాలు పొందే ప్రయత్నాలను దేశ మహిళలు తిరస్కరిస్తారని,కేంద్ర ప్రభుత్వం నిజంగా మహిళల పక్షాన ఉందని నిరూపించాలంటే, తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సమైక్య (ఎ ఐ ఎఫ్ డి డబ్ల్యూ) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మహిళను సమీకరించి ఆందోళన, పోరాటలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యురాలు మైదం పద్మ, గణిపాక బిందు, బెజ్జంకి పుష్ప, కాకి కోమల, పిట్టల పద్మ, లక్ష్మి, శారద తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్చాలి

**– ఎంఈఓ నర్సిములు**



రాయికోడ్ (తెలంగాణ వాణి ప్రతినిధి) సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలం పరిధిలోని హుల్గెర గ్రామంలో శనివారం నాడు మండల విద్యాధికారి నర్సిములు బడి బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ శివారులో ఉపాధి హామీ కూలీలు పని చేసే చోటుకు వెళ్లి వారికి విద్యపై అవగాహన కల్పించారు.తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలలకు పంపాలని ఆయన సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పుస్తకాలు, యూనిఫాం మరియు మధ్యాహ్న భోజనం వంటి సదుపాయాలను ఈ సందర్భంగా ఆయన వివరించారు.ప్రతి విద్యార్థి పాఠశాలలో చేరేలా కృషి చేయడం మరియు చదువు మానేసిన విద్యార్థులను తిరిగి బడికి తీసుకురావడమే ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. గ్రామ సర్పంచ్ మరియు ప్రజల సహకారంతో ఈ కార్యక్రమం విజయవంతంగా జరిగింది.ఈ కార్యక్రమంలో సర్పంచ్ నరసింహ ఉపసర్పంచ్ అశోక్, ఫీల్డ్ అసిస్టెంట్ నగేష్, గ్రామ పెద్దలు నగేష్, ప్రధానోపాధ్యాయులు అఖిలేష్ ఉపాధ్యాయులు కోటేశ్వర్ సీఆర్పీ రాజు మరియు ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

## పట్టణ ముఖచిత్రాన్ని మార్చేందుకు మున్సిపల్ చైర్మన్ స్పెషల్ డ్రైవ్

**– 99 రోజుల ప్రగతి ప్రణాళికతో పట్టణంలో పరుగులు తీస్తున్న పారిశుధ్య పనులు**

**– ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సహకారంతో వేములవాడను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతాం**



వేములవాడ ఏప్రిల్ 18 (తెలంగాణ వాణి ప్రతినిధి) వేములవాడ పట్టణ ముఖచిత్రాన్ని మార్చేయడమే ధ్యేయంగా మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు క్షేత్రస్థాయిలో వేగంగా అడుగులు వేస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికను స్ఫూర్తిగా తీసుకున్న ఆయన శనివారం తన సొంత వార్డు అయిన 15వ వార్డులో పారిశుధ్య పనులను స్వయంగా పర్యవేక్షించి యంత్రాంగాన్ని పరుగులు పెట్టించారు. మురికి కాల్వల పూడికతీత పనులను దగ్గరుండి పరిశీలించడమే కాకుండా పనుల నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని అధికారులకు, మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆదేశాల మేరకు పట్టణ ప్రజల ఆరోగ్య భద్రతకు పెద్దపీట వేస్తున్నామని వచ్చే వర్షాకాలం దృష్ట్యా దోమల నివారణకు,వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని స్పష్టం చేశారు. కేవలం పారిశుధ్యానికే పరిమితం కాకుండా వార్డులో కొత్తగా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయించడం అలాగే శాసన సభ్యులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పట్టణ ప్రజలకు కొరకు సిసి రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి 4.20 లక్షల రూపాయలు కేటాయించడం జరిగిందన్నారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న 15వ వార్డును పట్టణంలోనే ఒక ఆదర్శవంతమైన వార్డుగా తీర్చిదిద్దుతానని అలాగే పట్టణంలోని అన్ని వార్డులను సమానంగా అభివృద్ధి చేస్తూ వేములవాడను సర్వాంగ సుందరంగా మారుస్తానని ఆయన ప్రజలకు హామీ ఇచ్చారు. మున్సిపల్ కార్యాలయానికే పరిమితం కాకుండా ప్రతిరోజు వార్డుల్లో పర్యటిస్తూ ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సామాన్య ప్రజలకు అందుబాటులో ఉంటున్న చైర్మన్ పర్యటనలు ప్రజలను ఆకట్టుకుంటున్నాయి. మున్సిపల్ అధికారులను సమన్వయం చేసుకుంటూ పనుల్లో వేగం పెంచడమే కాకుండా అభివృద్ధి విషయంలో రాజీలేని ధోరణితో ముందుకు సాగుతున్న ఆయన పనితీరుపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ అనన్యతో పాటు మున్సిపల్ అధికారులు పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

## కేయూ విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ లో నరహరి కి పీహెచ్.డి పట్టా



పెద్దపల్లి :ఏప్రిల్,18 (తెలంగాణ వాణి ప్రతినిధి )వరంగల్‌లోని కాకతీయ విశ్వవిద్యాలయం, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ నుండి నరహరి అజ్మీర పీహెచ్.డి పట్టా పొందారు. డా. పి. కామాక్షి మార్గదర్శకత్వంలో ఆయన పరిశోధన పూర్తి చేశారు.డీప్ లెర్నింగ్ విధానాలను ఉపయోగించి ప్రొడక్ట్ రివ్యూల ఆధారంగా భావ విశ్లేషణ అనే అంశంపై ఆయన పరిశోధన నిర్వహించారు. ఈ పరిశోధన కృత్రిమ మేధస్సు సహజ భాషా ప్రక్రియ రంగాలకు సంబంధించినది.నర్సంపేట మండలం, కమ్మపల్లి గ్రామంలోని చెక్రం తండాకు చెందిన నరహరి అజ్మీర, సాధారణ రైతు కుటుంబానికి చెందినవారు. ఆయన తల్లిదండ్రులు అజ్మీర నర్సయ్య, చిలకమ్మ.ప్రస్తుతం జేఎన్టీయూహెచ్ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, మంథని లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.ఈ సందర్భంగా తన గైడ్ డా. పి. కామాక్షి కి, విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్, డీన్, బోర్డ్ ఆఫ్ స్టడీస్ ఛైర్మన్, ప్రిన్సిపల్, హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. తన తల్లిదండ్రులు అజ్మీరా నర్సయ్య, చిలకమ్మ భార్య కల్పనకు సహచరులు, మిత్రులు ఆయనను అభినందించారు.

## తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో సెక్రటేరియట్ ముట్టడి

**70మంది ఉద్యమకారులను అరెస్ట్ చేసిన పోలీసులు**

**జూన్ 2లోపు తెలంగాణ ఉద్యమకారులకు హామీలు అమలు చేయాలి**

**తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జనగా విష్ణువర్ధన్**



ములుగు/హైదరాబాద్ (తెలంగాణ వాణి) తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో శనివారం రోజు సెక్రటేరియట్ లోని ప్రిన్సిపల్ సెక్రెటరీకి వినతి పత్రం ఇచ్చేందుకు వెళ్లిన ఉద్యమకారులను రాష్ట్ర ప్రభుత్వం అన్యాయంగా అరెస్టు చేయించిందని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జనగా విష్ణువర్ధన్ అన్నారు. ఆనాడు తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం కొట్లాడిన తెలంగాణ ఉద్యమకారుల పక్షాన ప్రభుత్వాలు ఉండాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పొందుపరిచిన అంశాలు అన్ని అమలు చేయాలని కోరినప్పటికీ రెండున్నర సంవత్సరాలుగా గడుస్తున్న ప్రభుత్వం కేవలం నామమాత్రం హామీతో దాటవేస్తుంది అలాగే తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు ఎనిమిది వారాలలో ప్రభుత్వం స్పందించాలని హైకోర్టు ఉత్తర్వులు వచ్చినప్పటికీ ఇప్పటివరకు ప్రభుత్వం స్పందించకపోవడంతో ప్రిన్సిపల్ సెక్రటరీకి వినతిపత్రం ఇద్దామని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం రోజు వందలాదిమంది తెలంగాణ సెక్రటేరియట్ కు చేరుకోగా కనీసం వినతి పత్రం ఇచ్చేందుకు కూడా పోలీసులు నిరాకరిస్తూ ఉద్యమకారుని మాట వినకుండా అక్రమంగా దౌర్జన్యంగా ఉద్యమకారులపై దాడి చేసే విధంగా అరెస్టు చేస్తూ ఉద్యమకారులని పంజాగుట్ట పోలీస్ స్టేషన్లకు తరలించారు ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జనగా విష్ణువర్ధన్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులు రాష్ట్ర ప్రభుత్వానికి విన్నప డిమాండ్ జూన్ రెండో తారీఖు లోగా మేనిఫెస్టోలో పొందుపరిచిన హామీలన్నీ కూడా అమలు చేయని పక్షాన ముఖ్యమంత్రి ప్రసంగాన్ని కూడా అడ్డుకునేందుకు సంసిద్ధమవుతున్నామని అదేవిధంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న శాసనసభ్యులు మంత్రుల ఇల్లు కూడా ముట్టడి చేస్తామని తెలియజేస్తూ ప్రభుత్వానికి తెలియజేయడం జరిగింది ఏది ఏమైనా తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కొట్లాడిన ఉద్యమకారులను ఈ విధంగా అక్రమంగా అరెస్టు చేయడం బాధాకరం తెలంగాణలో ఉద్యమకారుడు వినతి పత్రం ఇచ్చేందుకు కూడా ప్రభుత్వాలు అనిచేయడం దీని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం తీవ్రంగా ఖండిస్తున్నాం ఈ యొక్క కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జనగా విష్ణువర్ధన్, మహిళా అధ్యక్షురాలు జానకి రెడ్డి, ఉపాధ్యక్షులు కొంచెం యాదిరెడ్డి, పడిగల రవీందర్ రెడ్డి, తాడూరు గగన్ కుమార్, డాక్టర్ కెవి కృష్ణారావు, కనకం కుమారస్వామి, అంజలి, మురారి, బిక్షపతి, భాష బోయిన రవీందర్, చిలువేరు రమేష్, గాజుల శ్రీనివాస్ గౌడ్, పల్లపు చిన్నారెడ్డి, వనజ, బాలమణి, పద్మ, కారంగుల నరేందర్ గౌడ్, ఉడత గంగాధర్, వివిధ నియోజకవర్గాల అధ్యక్షులు నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# మల్లాపూర్ గురుకులం వద్ద ఆర్టీసీ రిక్వెస్ట్ బస్ స్టాప్ బోర్డు ఏర్పాటు




ధర్మారం: ఏప్రిల్ 18 (తెలంగాణ వాణి ) పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలోని మల్లాపూర్ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల కళాశాల వద్ద గత కొన్ని నెలలుగా ఆర్టీసీ బస్సులు ఆపకపోవడం వల్ల టీచర్లు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యార్థులు అనారోగ్యం పాలైతే హాస్పిటల్ కు ప్రైవేటు వెహికిల్స్ లో తీసుకు వెళ్లాల్సి వస్తుందని, దీనిని దృష్టిలో పెట్టుకుని మాజీ పేరెంట్స్ కమిటీ చైర్మన్- తెలంగాణ గురుకులాల పేరెంట్స్ అసోసియేషన్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ సుంచు మల్లేశం ఇటీవల కరీంనగర్ ఆర్టీసీ వన్ డిపో మేనేజర్ ను కలిసి దరఖాస్తు ఇవ్వగా అక్కడ రిక్వెస్ట్ బస్ స్టాప్ ఏర్పాటు చేయాలని డిపో మేనేజర్ సూచించారు.డిపో మేనేజర్ సూచనల మేరకు మాజీ పేరెంట్స్ కమిటీ చైర్మన్ సుంచు మల్లేశం తన సొంత ఖర్చులతో ఆర్టీసీ రిక్వెస్ట్ బస్ స్టాప్ బోర్డును శనివారం పాఠశాల గేటు బయట ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గురుకుల పాఠశాల వద్ద ఆర్టీసీ బస్సులు ఆపకపోవడం దారుణమని. ఉపాధ్యాయులు అర కిలోమీటర్ దూరంలో ఉన్న పత్తిపాక ఎక్స్ రోడ్ వద్ద దిగి అక్కడే ఎక్కాల్సిన పరిస్థితి వస్తుందని నైట్ స్టే అనంతరం ఉపాధ్యాయులు పాఠశాల నుండి నడిచి వెళ్లడం వల్ల వారికి భద్రతా లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీ అధికారులు, సంబంధిత మంత్రి ప్రత్యేక చొరవ తీసుకొని మల్లాపూర్ గురుకుల పాఠశాల వద్ద ఆర్టిసి బస్సులను నిలిపేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ అరుణ. జూనియర్ వైస్ ప్రిన్సిపల్ వెంకటలక్ష్మి, మాజీ పేరెంట్స్ కమిటీ నాయకులు వడ్కాపురం రవి, కాంపల్లి తిరుపతి, మెట్పల్లి నరేష్, జుంజి పెల్లి నారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# బడిబాట కార్యక్రమంలో




## ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఈవో విజయ

మెదక్ ఏప్రిల్ 18:(తెలంగాణ వాణి ప్రతినిధి) మెదక్ జిల్లా హవేలి ఘనపూర్ మండలం కూచంపల్లి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు బడిబాట కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి కూ చన్ పల్లి గ్రామపంచాయతీ వరకు భారీ ర్యాలీగా ప్రైవేటు స్కూలు వద్దు గవర్నమెంట్ స్కూలు ముద్దు అంటూ విద్యార్థులు మానవహారం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా విద్యాశాఖ అధికారి విజయ ఎం ఈ ఓ మరియు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మధుమోహన్ పాల్గొన్నారు డి ఈ ఓ విజయ మాట్లాడుతూ పిఎం శ్రీ ఎంపికైనందుకు చాలా గర్వపడుతున్నానని ఈ స్కూల్లో 450 స్టూడెంట్ ఉండగా దీన్ని గ్రామ ప్రజలు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు 600 పైగా స్టెన్త్ పెంచాలని మంచి ఉపాధ్యాయుల బృందం ఈ స్కూల్లో ఉన్నదని ప్రైవేటు స్కూళ్లకు దీటుగా గవర్నమెంట్ స్కూలు ఉన్నాయని ప్రైవేట్ స్కూళ్లకు పంపకుండా గవర్నమెంట్ స్కూల్లో చేర్పించాలనికోరారు ఈ స్కూల్లో అన్ని వసతులు ఉన్నాయని దీని అందరూ సద్వియోగం చేసుకోవాలని గవర్నమెంట్ స్కూల్లో చదువుకున్న విద్యార్థులుఉన్నత స్థానాలకు ఎదిగారని ఇప్పుడు కూడా స్కూల్లో చదువుకున్న పిల్లలు ఎన్నో ఉన్నత స్థాయికి ఎదగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని అన్నారుగ్రామ ప్రజలను మరియు చుట్టుపక్క గ్రామాల ప్రజలను ప్రైవేట్ స్కూల్లో చేర్పించకుండా గవర్నమెంట్ స్కూల్లో చదివించాలని ఆమె కోరారు అనంతరం స్కూల్ యొక్క కరపత్రాన్ని ప్రారంభం చేశారు ఈ కార్యక్రమంలో సీఎం ఏవో రాజు మాజీ సర్పంచ్ జండా కాడి దేవా గౌడ్ లింగాల సంతోష్ మాజీ విద్యా కమిటీ చైర్మన్ కొజ్జాపురం యేసయ్య ఉపాధ్యాయుల బృందం గ్రామ ప్రజలు విద్యార్థులు తదితరులుభారీ ఎత్తున పాల్గొన్నారు

# చర్లలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలి




## బీఆర్ఎస్ కన్వీనర్ దొడ్డి తాతారావు డిమాండ్

చర్ల (తెలంగాణ వాణి) చర్ల మండలంలో తక్షణమే ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ పార్టీ కన్వీనర్ దొడ్డి తాతారావు డిమాండ్ చేశారు. 2023 ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు ఫైర్ స్టేషన్, డిగ్రీ కళాశాల, ఒద్దిపేట లిఫ్ట్ ఇరిగేషన్ వంటి పలు హామీలు ఇచ్చారని, అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి మూడు సంవత్సరాలు గడిచినా వాటిని అమలు చేయలేదని ఆయన విమర్శించారు. ఏప్రిల్, మే నెలల్లో తీవ్రమైన ఎండల కారణంగా అగ్ని ప్రమాదాల అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. చర్లలో ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయడం సాధ్యం కాకపోతే కనీసం ఒక ఫైర్ ఇంజన్ అయినా అందుబాటులో ఉంచాలని కోరారు. ప్రస్తుతం అగ్ని ప్రమాదం జరిగితే భద్రాచలం నుంచి ఫైర్ ఇంజన్ వచ్చేలోపు ఇళ్లు, ఆస్తులు పూర్తిగా దగ్ధమవుతున్నాయని, ప్రజలు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారని అన్నారు. అగ్ని ప్రమాదాల్లో ఇళ్లు కోల్పోయిన వారికి ప్రభుత్వం తగిన సహాయం అందించడం లేదని, తక్కువ మొత్తంలో పరిహారం ఇచ్చి చేతులు దులుపుకుంటుందని విమర్శించారు. ఇల్లు కోల్పోయిన కుటుంబాలు మళ్లీ సాధారణ జీవితానికి రావడానికి సంవత్సరాలు పడుతున్నాయని తెలిపారు. ఇక కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఇతర హామీలపైనా ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. మహిళలను కోటీశ్వరులను చేస్తామని చెప్పినా, ఒంటరి మహిళలు, విధవలు పెన్షన్ల కోసం ఎదురుచూస్తున్నారని

# శ్రీ చైతన్య లో ఘనంగా కిండర్ గార్డెన్ ప్రోగ్రాం





జగిత్యాల/వెల్గటూర్: (తెలంగాణ వాణి ప్రతినిధి) మండల కేంద్రంలోని శ్రీ చైతన్య పాఠశాల లో శనివారం రోజున ఎల్కేజీ విద్యార్థులకు కిండర్ గార్డెన్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. యూకేజీ విద్యార్థులు ఉన్నత బాలవిహార్ తరగతి ముగించుకుని ఒకటో తరగతి వెళుతున్న సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ బిడారి సతీష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ బిడారి సతీష్ మాట్లాడుతూ గత మూడు సంవత్సరాల నుండి వరుసగా జవహర్ నవోదయ పాఠశాలో సీటు సాధిస్తు, అతి తక్కువ ఫీజులతో కార్పొరేట్ పాఠశాలకు దీటుగా విద్యనందిస్తున్న ఏకైక పాఠశాల శ్రీ చైతన్య పాఠశాల అని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతి మాట్లాడుతూ ధర్మపురి నియోజకవర్గంలో అబాకస్ వేదిక్ గణితం ను పిల్లలకు అందిస్తున్న ఏకైక పాఠశాల శ్రీ చైతన్య అని తెలిపారు. తదనంతరం ఎల్కేజీ, యూకేజీ విద్యార్థులకు తరగతి ఉపాధ్యాయులు సర్టిఫికెట్. అబాకస్, వేదిక్ గణితం లో మెరిట్ సాధించిన విద్యార్థులకు గోల్డ్ ,సిల్వర్ మెడల్ అబాకస్ అండ్ వేదిక్ గణిత ఉపాధ్యాయులు అందించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రాజేష్, వనజ, నవ్య, అనూష,సాహితి, కార్తిక, స్వప్న, సువర్ణ, శిరీష, మానస, శిరీష,అనిత, కీర్తి, ఆండాళ్ రజిత, కళ్యాణి, సంధ్య, మల్లీశ్వరి, రజిత, అంజలి, మంజు భార్గవి విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఫిన్లాండ్ టూర్ కు నందిగామ టీచర్

## అక్కడి బోధనా పద్ధతులపై క్షేత్రస్థాయిలో పరిశీలన



పటాన్ చెరు, ఏప్రిల్, 18, (తెలంగాణ వాణి రిపోర్టర్) ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను అంతర్జాతీయ స్థాయికి చేర్చడమే లక్ష్యంగా, విద్యాశాఖ ప్రతి ష్టాత్మక ముందడుగు వేసింది. ఎక్పోజర్ విజిట్లో భాగంగా రాష్ట్రం లోని 40 మంది ఉత్తమ ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులతో కూడిన బృందాన్ని ఐదు రోజుల పాటు ఫిన్లాండ్ విద్యా పర్యటనకు ప్రభుత్వం పంపిస్తోంది. ఈ పర్యటనకి పటాన్ చెరు మండల పరిధిలోని నందిగామ ప్రాథమిక ఉన్నత పాఠశాల లో పని చేస్తున్న రమణి టీచర్ కూడా ఎంపికయ్యారు. ఈ నేపథ్యంలో ఆమెను శనివారం నాడు పాఠశాల హెడ్ మాస్టర్ కళ్యాణి, తోటి ఉపాధ్యాయురాళ్లు ఘనంగా సన్మానించారు. ప్రపంచంలోనే అత్యుత్తమ విద్యా ప్రమాణాలు కలిగిన దేశంగా పేరు గాంచిన ఫిన్లాండ్ విద్యా విధానాన్ని అధ్యయనం చేసేందుకు రాష్ట్రం నుంచి 40 మంది ఉపాధ్యాయుల బృందం ఈ నెల 20 నుంచి 24 వరకు అక్కడ పర్యటించనుంది. అక్కడ అవలంబిస్తున్న విధానాలను వారు పరిశీ లించి రాష్ట్రంలో ప్రభుత్వ స్కూళ్లలో అమలు చేయాలని విద్యాశాఖ భావిస్తోంది. ఈ కార్య క్రమంలో హెడ్ మాస్టర్ కళ్యాణి. ఇతర ఉపాధ్యాయులు శైలజ, శారద, సత్య నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు అవగాహన సదస్సు



చౌటుప్పల్,ఏప్రిల్ 18 (తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి) యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం నేలపట్ల గ్రామంలో ని రైతు కుర్లపల్లి సైదులు వ్యవసాయ పొలంలో నాలుగు ఎకరాలు త్రిమూర్తి సీడ్స్ వారి టీ ఎం ఆర్ హెచ్ 5786 రకం సాగు చేసి మంచి దిగుబడి రావడంతో గ్రామంలో కంపెనీ ప్రతినిధులు టి ఎస్ ఎమ్ మధు ఆధ్వర్యంలో రైతు అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా రైతు మాట్లాడుతూ త్రిమూర్తి సీడ్స్ 5786 రకం చాలా బాగుందని ఒక్కొక్క కంకి సుమారు 400 వరకు గింజలు ఉన్నాయని ఎకరాకు 45 క్వింటాల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉందని రైతు ఆశాభావం వ్యక్తం చేశాడు. ఈ సందర్భంగా రైతుని కంపెనీ ప్రతినిధులు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీలర్ లింగస్వామి, కంపెనీ ప్రతినిధులు,సుమారు 100 మంది రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఐనా పూర్ గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో వడ్ల కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొమురవెల్లి (తెలంగాణ వాణి ప్రతినిధి) సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలం ఐనాపూర్ గ్రామంలో గ్రామ సర్పంచ్ ఏర్పుల కళ్యాణి కృష్ణ ఆధ్వర్యంలో ఐకెపి వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించడం జరిగింది సర్పంచ్ మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా ఎండల తీవ్రత ఎక్కువ ఉండడం వల్ల తాగునీరు రైతులకు అందుబాటులో ఉంచి మరియు రైతులకు ప్రభుత్వం చెల్లిస్తున్నటువంటి గిట్టుబాటు ధరను తొందరగా అందేలా చర్యలు తీసుకోవాలని ఐకెపి సిబ్బందికి సూచనలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో డి సి సి వైస్ ప్రెసిడెంట్ మెరుగు శ్రీనివాస్ గ్రామ శాఖ అధ్యక్షులు మల్లం బాలయ్య మాజీ సర్పంచ్ చెరుకు రమణారెడ్డి ఉప సర్పంచ్ మల్లం శ్రీనివాస్ లంబ శ్రీకాంత్ మోహన్ రెడ్డి గొల్ల మల్లయ్య చెరుకు సుమలత ఐకెపి సిసి కవిత సిఎ మెరుగు నవిత వివో అధ్యక్షురాలు రేణుక ఎం పద్మ గ్రామ రైతులు మరియు హమాలీ సంఘం సభ్యులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# హిందూ సమ్మేళనం విజయవంతం కొరకు బైక్ ర్యాలీ



చౌటుప్పల్ (తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి) నేడు జరగనున్న మహా హిందూ సమ్మేళనం ప్రచార నిమిత్తం శనివారం చౌటుప్పల పురవీధుల గుండా హిందూ సమ్మేళన సమితి ఆధ్వర్యంలో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించడం జరిగినది. ఈ ర్యాలీని హిందూ సమ్మేళన సమితి అధ్యక్షులు కేవీబి కృష్ణారావు ప్రారంభించారు. ప్రధాన కార్యదర్శి కొసనం రాంరెడ్డి, కోశాధికారి కర్నాటి శ్రీనివాసులు సారథ్యం వహించగా ర్యాలీ నిర్వహణ బాధ్యులు డాక్టర్ వేముల నరసింహ, క్లాత్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షులు కర్నాటి శ్యాం ప్రసాద్ బాధ్యత తీసుకొని బ్రహ్మాండమైన ర్యాలీని పురవీధుల గుండా నిర్వహించడం జరిగినది.

ర్యాలీ అనంతరం హిందూ సమ్మేళనా సమితి అధ్యక్షులు కే వి బి కృష్ణారావు మాట్లాడుతూ ఈ హిందూ సమ్మేళనానికి ముఖ్యఅతిథిగా త్రై లింగ ప్రాంత సామాజిక సంఘటన సేవా ప్రతీపూజ్యశ్రీ వాసుదేవానంద సరస్వతి , ముఖ్య వక్తగా జిన్నా సత్యనారాయణ రెడ్డి, తెలంగాణ ప్రాంత గ్రామ వికాస్ ప్రముఖ్, మహిళా వక్తగా పర్వతం సంధ్యారాణి, ప్రముఖ సామాజికవేత్త మార్గదర్శనం చేయ నున్నారు. కావున ప్రతి ఒక్కరు పట్టణములోని ప్రతి ఇంటి నుండి సమ్మేళన మనకు వచ్చేటట్లుగా కృషి చేయాలని సమావేశంలో తెలిపారు. ఈ కార్యక్రమంలో సీతారామచంద్రస్వామి దేవస్థానం అధ్యక్షులు మురళి , శివ భక్త మార్కండేయ స్వామి దేవస్థానం అధ్యక్షులు బడుగు జయప్రకాష్, మహిపాల్ రెడ్డి, జక్కర్తి శేఖర్ బత్తిని రఘు గౌడ్ విశ్వనాథ్ శ్రీనివాస్ బిజిలి నరేష్ , మునుకుంట్ల సత్యనారాయణ, గుర్రం వెంకటేశం, కాంసెట్టి చంద్రశేఖర్, భీమిడి మోహన్ రెడ్డి, బడుగు శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో ఇండియా కూటమి దిష్టిబొమ్మ దగ్ధం



ములుగు (తెలంగాణ వాణి):ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం పస్రా గ్రామంలో జాతీయ రహదారి 163 పైన పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లును వ్యతిరేకించి బిల్లు పాస్ కాకుండా చూసిన ప్రతి పక్షాల నేతలు,మరియు ఇండియా కూటమి దిష్టిబొమ్మను గోవిందరావుపేట బీజేపీ పార్టీ మండల అధ్యక్షులు మార్క సతీష్ ఆధ్వర్యంలో దహనం చేసినారు. నారీ శక్తి వందన్ లో భాగంగా మహిళలకు చట్ట సభల్లో 33శాతం రిజర్వేషన్లు కల్పించాలని పార్లమెంటులో బిల్లు ప్రవేశ పెడితే ప్రతిపక్షాలు ఎక్కడ బీజేపికి కేంద్ర ప్రభుత్వానికి క్రెడిట్ దక్కుతుందో అని అక్కసుతో ప్రతి పక్షాలు, ఇండియా కూటమి కుల్లు, కుతంత్రాలుగా మహిళా రిజర్వేషన్ బిల్లును వీగి పోయేలా చేసి వికటాట్టహాసంగా చంకలు గుద్దుకునేలాగా ప్రవర్తించిన తీరుకు మహిళా లోకం గమనించింది అని, రాబోయే రోజుల్లో మహిళలే ఇండి కూటమికి తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు టి దేవేందర్ రావు,జిల్లా ప్రధాన కార్యదర్శి జాడి వెంకట్, జిల్లా ఉపాధ్యక్షులు ఏనుగు రవీందర్ రెడ్డి,జిల్లా కార్యదర్శి కొత్త సుధాకర్ రెడ్డి, ని డుమోలు శ్రీనివాస్, మేరుగు సత్యనారాయణ, కర్ర సాంబశివ రెడ్డి, గాందర్ల నరేష్, ఏదునూరి రమేష్, వంగాల సోమ్మిరెడ్డి, వలుపదాసు రవిశంకర్, బొల్లంపల్లి మురళి, మార్త రమేష్, అమ్మ లింగయ్య, బండి మోహన్, నిడుమోలు సాంబయ్య బండి వేణు జవహర్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ లో ఉన్న వేతనాలను
# వెంటనే చెల్లించాలి

- ఉపాధి హామీ కార్మికుల సమస్యలపై ఈనెల 21వ తేదీన ఎంపీడీవో ఆఫీసు ముందు జరిగే ధర్నాను జయప్రదం చేయండి
- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు తాడూరు రవీందర్



కొమురవెల్లి (తెలంగాణ వాణి ప్రతినిధి) ఉపాధి హామీ కూలీలకు సంవత్సరానికి 200 రోజుల పని దినాలు కల్పించాలి రోజు కూలీ 600 రూపాయలు ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు తడూరి రవీందర్ డిమాండ్ చేశారు కార్మికులకు గత మూడు నెలల నుండి డబ్బులు రాక ఉపాధి హామీ కార్మికు లు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సిద్దిపేట జిల్లా అధ్యక్షులు తాడూరి రవీందర్ అన్నారు. శనివారం రోజున కొమురవెల్లి మండలంలోని గురువన్నపేట గ్రామంలో ఉపాధి హామీ పని ప్రదేశంలో ఉపాధి హామీ కార్మికు లతో వారి సమస్యలు అడిగి తెలుసుకొని ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన వి బి జి రాంజీ చట్టాన్ని రద్దుచేసి గతంలో ఉన్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యధావిధిగా కొనసాగించాలని ఉపాధి హామీ కార్మికులకు రోజుకు 600 రూపాయలు వేతనాలు ఇవ్వాలని సంవత్సరంలో 200 రోజులు పని కల్పించాలని రోజుకు రెండు సార్లు ఫోటో క్యాప్సర్ విధానాన్ని రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ఈ తీరును 125 రోజులు కొత్త చట్టం ద్వారా పని కల్పిస్తామని చెప్పేటటువంటి ప్రభుత్వం ఆ విధంగా బడ్జెట్లో బడ్జెట్ కేటాయించలేదు కేంద్ర ప్రభుత్వం కేటాయించిన బడ్జెట్ ఏ మాత్రం సరిపోదు కూలీలకు గడ్డపార పట్టి తవ్వేవారికి అదనంగా ఐదు రూపాయలు ఇచ్చేవారని వాటిని కూడా ప్రభుత్వం ఇవ్వడం లేదని, గడ్డపార సాన పెట్టియ్యడానికి డబ్బులు ఇచ్చేవారు వాటిని కూడా ఇవ్వడం లేదు కార్మికులను ప్రభుత్వం ఇబ్బంది పెడుతుందని ఆయన అన్నారు. పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని లేని పక్షంలో కార్మికులను ఏకం చేసి ఆందోళన పోరాట లు నిర్వహిస్తామని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో మండల నాయకులు తేలు ఇస్తారి పాకనాటి బాలు ఉపాధి హామీ కార్మికులు సుధాకర్ సంగమేశ్వర్ గాజా రాములు గిల్లే యాదవ్వ పుల్లమైన రజిత జిల్లా బుచ్చవ్వ భాగ్యవ్వ లక్ష్మి యాదమ్మ కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు

# టాస్ పరీక్షలకు 'పోలీస్' కవచం!

### జిరాక్స్ సెంటర్లు బంద్.. కేంద్రాల వద్ద 144 సెక్షన్.. ఎస్పీ స్నేహ మెహ్రా కఠిన ఆదేశాలు



వికారాబాద్ (తెలంగాణ వాణి ప్రతినిధి) వికారాబాద్ జిల్లాలో ఈ నెల 20వ తేదీ నుంచి ప్రారంభం కానున్న తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ వార్షిక పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించేందుకు జిల్లా పోలీస్ యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్ పరీక్షల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా, ఐపీఎస్ పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా వికారాబాద్ టౌన్‌లో రెండు ఎస్ఎస్‌సీ, రెండు ఇంటర్మీడియట్ కేంద్రాలను, తాండూరు టౌన్‌లో ఒక ఎస్-ఎస్‌సీ మరియు రెండు ఇంటర్మీడియట్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ పరీక్షా కేంద్రాల వద్ద భద్రతను పర్యవేక్షించాల్సిందిగా సంబంధిత ఎస్.హెచ్.ఓలు, ఇన్‌స్పెక్టర్లకు ఎస్పీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. **నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు:** పరీక్షల సమయంలో మాస్ కాపీయింగ్‌కు తావులేకుండా పరీక్షా కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లను తప్పనిసరిగా మూసివేయాలని ఎస్పీ ఆదేశించారు. కేంద్రాల పరిసరాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ఎవరైనా అనుమానాస్పదంగా తిరిగినా లేదా నిబంధనలను అతిక్రమించినా వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులు ఎటువంటి ఆందోళన లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాసేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆమె ప్రకటనలో పేర్కొన్నారు.

# 'నారీ శక్తి'కి అడ్డంకులు వేసిందెవరు

### మహిళా రిజర్వేషన్లపై ఎర్రోళ్ల లక్ష్మయ్య
### మోదీ వల్లే ఇది సాధ్యమైందని స్పష్టీకరణ



వికారాబాద్: ఏప్రిల్ 18 (తెలంగాణ వాణి ప్రతినిధి) మహిళా సాధికారతకు దిక్సూచి వంటి 'మహిళా రిజర్వేషన్ బిల్లు' ప్రయాణంలో గత ప్రభుత్వాల వైఖరిపై వికారాబాద్ జిల్లా బీజేపీ కార్యదర్శి ఎర్రోళ్ల లక్ష్మయ్య నిప్పులు చెరిగారు. చట్టసభల్లో మహిళలకు సముచిత స్థానం కల్పించే ఈ చారిత్రాత్మక బిల్లును దశాబ్దాల పాటు అడ్డుకున్న పార్టీల అసలు రంగును ఆయన బయటపెట్టారు. శనివారం వికారాబాద్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. మహిళల ప్రగతి కంటే స్వార్థ రాజకీయ ప్రయోజనాలకే కొన్ని పార్టీలు పెద్దపీట వేశాయని విమర్శించారు. దశాబ్దాల తరబడి పెండింగ్‌లో ఉన్న ఈ బిల్లును ఆమోదించకుండా రకరకాల సాకులు చెపుతూ కాలయాపన చేశారని, తద్వారా మహిళా లోకానికి అన్యాయం చేశారని మండిపడ్డారు. సమాజంలో సగభాగంగా ఉన్న మహిళలకు రాజకీయాల్లో సమాన అవకాశాలు కల్పించాల్సిన బాధ్యతను విస్మరించి, అప్పటి ప్రభుత్వాలు బిల్లును నీరుగార్చే ప్రయత్నం చేశాయని ఆరోపించారు. ఎట్టకేలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దృఢ సంకల్పం వల్లే 'నారీ శక్తి వందన్ అధినియం' చట్టంగా రూపుదాల్చిందని లక్ష్మయ్య గుర్తు చేశారు. మహిళల పట్ల నిజమైన చిత్తశుద్ధి ఉన్న ప్రభుత్వం కాబట్టే బీజేపీ ఇలాంటి సాహసోపేత నిర్ణయం తీసుకోగలిగిందని ఆయన స్పష్టం చేశారు. ఈ బిల్లు ఆమోదం పొందడం ద్వారా భారత రాజకీయాల్లో మహిళల పాత్ర సరికొత్త చరిత్రను సృష్టించబోతోందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# జాతీయ ఉపాధి హామీ పనులను ఎలా చేస్తున్నారు?

### ఎంపికను బహిర్గతం చేయాలని చిల్పూర్ ఎండీఓను డిమాండ్ చేసిన సీపీఎం!



చిల్పూర్ (తెలంగాణ వాణి ప్రతినిధి) జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా చిల్పూర్ మండలంలో చేస్తున్న అభివృద్ధి పనుల వివరాలపై సమగ్ర నివేదికను ప్రజలకు బహిర్గత పరచాలని,సీపీఎం పార్టీ చిల్పూర్ మండల కార్యదర్శి సాదం రమేష్ చిల్పూర్ ఎండివో ను డిమాండ్ చేశారు.ఈ రోజు చిల్పూర్ మండల కేంద్రంలో సాదం శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా మండలంలోని మొత్తం గ్రామాలలో సీసీ రోడ్లు,మహిళా సంఘ భవనాలు,స్కూల్ ప్రహరీగోడలు, పీహెచ్సీ(హెల్త్ సెంటర్) లు,డ్రైనేజి,తదితర నిర్మాణ పనులు చెశారో? ఏ గ్రామానికి,ఎన్ని లక్షల చొప్పున నిధులు విడుదల చేశారో?స్పష్టంగా తెలియచేయాలని ఆయన కోరారు. కమీషన్ ఇచ్చే నాయకుల గ్రామాలకు ఎక్కువ నిధులను ఇచ్చి ఇవ్వని గ్రామాలకు మొండి చేయి చూపిస్తున్నరని ఆయన ఆరోపించారు. ప్రతిపక్షపార్టీ సర్పంచ్ లు గెలిచిన గ్రామాల మీద కక్షగట్టి నిధులు ఇవ్వకుండా అధికార పార్టీ నేతల అడుగులకు మడుగులొత్తుతున్నరని ఆయన విమర్శించారు.ఎలాంటి పక్షపాతం లేకుండ మండలంలోని అన్ని గ్రామాలను సమగ్రాభివృది చేయాల్సింది పోయి,కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న గ్రామాలకే ఎక్కువ నిధులు ఇస్తూ,మిగతా గ్రామాలను చిన్న చూపు చూడడం తగదని ఆయన హితవు పలికారు.ఇప్పటికైనా,మండలంలోని అన్ని గ్రామాలకు నిధులు ఇచ్చి అభివృద్ధి పరచాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో ఆవుల ప్రభాకర్,ఊరడి బుచ్చిరాజ్,సాదం రాజు,నారబోయిన బిక్షపతి,సాదం రామరాజు.తదితరులు పాల్గొన్నారు.

# కాళేశ్వరంపై కాంగ్రెస్‌కు కాలయాపన

### బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్





వరంగల్ (తెలంగాణ వాణి) రెండున్నరేళ్లుగా మేడిగడ్డ పిల్లర్లను రిపేర్ చేసే ప్రయత్నం కాంగ్రెస్ ప్రభుత్వం చేయడం లేదని,కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు మెడిగడ్డ లోని రెండు పిల్లర్ల నిర్మాణానికి కాలయాపన చేస్తుందని హనుమకొండ బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు.

ఉమ్మడి వరంగల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ నేతలందరితో కలిసి చలో కాళేశ్వరం - దేఖో మేడిగడ్డ పిలుపులో భాగంగా శనివారం రోజున కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించడం జరిగింది.ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజలకు సాగునీరు,తాగునీరు అందించేందుకు కేసీఆర్ కల్పతరు లాంటి కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించడం జరిగిందన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రైతాంగం ఆనందంగా, సంతోషంగా జీవించిందన్నారు.
రెండున్నరేళ్ల క్రితం మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ కేసీఆర్ ను బద్నాం చేసే కుట్ర చేసిందని,కాళేశ్వరం కూలిందని, కొట్టుకుపోయిందని దుష్ప్రచారాలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి, రేవంత్ రెడ్డి కి కాళేశ్వరం ప్రాజెక్టు ప్రాముఖ్యతను, కూలిపోలేదని చూపేందుకు ఈ రోజు బీఆర్ఎస్ ప్రతినిధుల బృందం మేడిగడ్డను సందర్శించారు.ఇప్పటికైనా కాళేశ్వరం విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం కళ్లు తెరిచి,దెబ్బతిన్న మూడు పిల్లర్లను రిపేర్ చేయాల్సిందిగా డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు,మాజీ ఎమ్మెల్యేలు తాటికొండ రాజయ్య,గండ్ర వెంకట రమణారెడ్డి,ఆరూరి రమేష్,శంకర్ నాయక్,పుట్ట మధు, మాలోతు కవితతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# చలాన్ల వేడి లేదు.. గులాబీల పరిమళమే!

### - హుస్నాబాద్‌లో ట్రాఫిక్ రూల్స్ బ్రేక్ చేస్తే ఫైన్ పడదు.. పూలదండ పడుతుంది !- దండతో సిగ్గే..పడాలో సిగ్గు తెచ్చుకోవాలో.!



సిద్దిపేట/హుస్నాబాద్: (తెలంగాణ వాణి ప్రత్యేక ప్రతినిది) హుస్నాబాద్ రోడ్లపై శనివారం ట్రాఫిక్ పోలీసులు వాహనాలను ఆపుతుంటే, చలానా పడుతుందేమోనని భయపడ్డ వాహనదారులకు ఊహించని సర్ ప్రైజ్ ఎదురైంది. 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో భాగంగా పోలీసులు 'జీరో ఎన్‌ఫోర్స్‌మెంట్ డే' నిర్వహించి అందరినీ ఆశ్చర్యపరిచారు. సాధారణంగా హెల్మెట్ లేకపోయినా, లైసెన్స్ లేకపోయినా పోలీసులు రశీదులు రాసి జరిమానాలు విధిస్తారు. కానీ ఇక్కడ సీన్ రివర్స్ అయింది. నిబంధనలు పాటించని వారిని ఆపి, వారు చేసిన తప్పుకు ఎంత జరిమానా పడాలో వివరించి.. ఆ మొత్తాన్ని వసూలు చేయకుండా వారికి ప్రేమతో గులాబీ దండలు వేశారు. ఆ తప్పు వల్ల ప్రాణాలకే ముప్పు వాటిల్లుతుందని సున్నితంగా నచ్చజెప్పారు. ఈ వినూత్న కార్యక్రమాన్ని చూసిన స్థానికులు ఈ దండలతో సిగ్గు పడాలో ఇలాంటి తప్పులు మరోమారు చేయకుండా సిగ్గే పడాలో అంటూ చర్చించుకుంటున్నారు. కాగా ?ఈ సందర్భంగా ఎస్ఐ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, తాము చలానాలు రాసి ఖజానా నింపడం కంటే, ప్రతి వాహనదారుడు సురక్షితంగా తన ఇంటికి చేరుకోవాలన్నదే తమ అసలు ఉద్దేశమని వెల్లడించారు. జరిమానాల భయం కంటే బాధ్యతతో కూడిన అవగాహన మనుషుల్లో మార్పు తెస్తుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ వినూత్న ప్రయోగంలో ట్రాఫిక్ ఎస్ఐ వెంకటేశ్వర్ రెడ్డి మరియు సిబ్బంది పాల్గొని వాహనదారులకు ట్రాఫిక్ పాఠాలు నేర్పారు.

## ప్రతి ఆరోగ్యవంతమైన వ్యక్తి రక్తదానం చేయాలి



నారాయణఖేడ్ (తెలంగాణ వాణి ప్రతినిధి) ప్రతి ఆరోగ్యవంత వ్యక్తి రక్తదానం చేయాలని ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఓంప్రకాష్, సంగారెడ్డి,మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎం.ఏ ఖైసర్, సంతోష్ రావు పాటిల్ అన్నారు. శనివారం నారాయణఖేడ్ పోలీస్ స్టేషన్ ఆవరణలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో, లయన్స్ క్లబ్ సహకారంతో నిర్వహించిన రక్తదాన శిబిరం విజయవంతంగా జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రక్తదానం మహాదానం అని, ఇది ప్రాణాలను కాపాడే అత్యంత విలువైన సేవ అని అన్నారు. ప్రతి ఆరోగ్యవంతుడు కనీసం మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయాలని సూచించారు. ప్రమాదాలు, అత్యవసర పరిస్థితులు, శస్త్రచికిత్సలు వంటి సందర్భాల్లో రక్తం అవసరం పెరుగుతుందని, రక్త నిల్వలు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేందుకు యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, యువకులు,స్వచ్ఛంద సేవకులు ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి నిర్వాహకులు ప్రశంసలు తెలియజేసి, భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ వెంకట్ రెడ్డి, సిఐలు శ్రీనివాస్ రెడ్డి, వెంకట్ రెడ్డి ఆయా మండలాల ఎస్సైలు, లయన్స్ క్లబ్ నారాయణఖేడ్ అధ్యక్షులు సాయి సంగమేశ్వర్, బాధ్యులు రాజు, శేఖర్, యూసుఫ్ , జర్నలిస్ట్ పరమేష్, ఫయాజ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## విజేత హై స్కూల్ లో ఘనంగా పట్టభద్రుల దినోత్సవం



నారాయణఖేడ్, ఏప్రిల్ 18: (తెలంగాణ వాణి ప్రతినిధి) విద్యార్థుల పరీక్షలు పూర్తయి నూతన ఉత్తేజంతో ఉన్నత తరగతిలోకి వెళుతున్న సందర్భంగా నారాయణఖేడ్ విజేత హై స్కూల్ ప్రిన్సిపల్ ఎం. శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం పట్టభద్రుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ఎం. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ..విద్యార్థులు తమ లక్ష్యాలను స్పష్టంగా నిర్ణయించుకుని క్రమశిక్షణతో చదువుతూ ముందుకు సాగాలని సూచించారు. పట్టుదల, సమయపాలన, కష్టపడి చదవడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు. తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయుల సహకారంతో విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని అన్నారు. ఇలాంటి ప్రోత్సాహక కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి, భవిష్యత్తులో మంచి పౌరులుగా ఎదగడానికి దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# దరువు జాతర వాల్ పోస్టర్ విడుదల చేసిన నిరుద్యోగ కళాకారుల సంఘం




మెదక్ (తెలంగాణ వాణి ప్రతినిధి) రేపు హైదరాబాద్ లోని రవీంద్ర భారతి లో జరుగబోయే దరువు జాతర వాల్ పోస్టర్ను మెదక్ టి ఎన్ జి ఓ భవన్ వద్ద మెదక్ జిల్లా కళాకారులు విడుదల చేశారు. తెలంగాణ ఉద్యమం నుండి మొదలు కొని ఈనాటి వరకు ఎన్నో ప్రజా ఉద్య మాలు చేసిన ఘనత దరువు ఎల్లన్న, దరువు అంజన్నది వారి ఆధ్వర్యంలో దరువు వేదిక ను స్థాపించి నేటికీ 25 సంవత్సరాల సందర్భంగా "వీరులారా వందనం విద్యార్థి అమరులారా వందనం పాదాలకు" వీడియో పాటను కూడా విడుదల చెయ్యడం జరుగుతుంది. కావున ఉద్యమ కారులు, ఉద్యమ కళాకారులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ జాతరని విజయవంతం చెయ్యాలని దరువు అంజన్న కు దరువు ఎల్లన్నకు అందరు మద్దత్తునివ్వాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉద్యమనిరుద్యోగ కళాకారుల మెదక్ జిల్లా అధ్యక్షులు గుడాల సత్యనారాయణ , కళాకారులు నీరుడి సాయిలు, వరిగొంతం శేఖర్ చారి , అల్లారం పాపయ్య , దేవరాజు, జి. చంద్ర శేఖర్ పాల్గొన్నారు

# మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలు శిక్ష, జరిమానా తప్పదు

## మద్యం సేవించి పట్టుబడిన 18 మంది మందు బాబులకు జైలు శిక్షలు

### జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఐపిఎస్



రాజన్న సిరిసిల్ల,ఏప్రిల్ 18 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి) : సిరిసిల్ల సబ్ డివిజన్ పరిధిలో ఉన్న పోలీస్ స్టేషన్ల లలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలలో 20 మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతు పట్టుబడగా వారిని పోలీసులు శనివారం సిరిసిల్ల కోర్టులో హాజరుపరచగా మేజిస్ట్రేట్ ప్రవీణ్ జైలు శిక్షలు,జరిమానాలు విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు ఎస్పీ తెలిపారు.9 మందికి ఒక రోజు జైలు శిక్ష, ఒక్కొక్కరికి 4000,రూపాయల జరిమాన,7 గురికి రెండు రోజుల జైలు శిక్ష, ఒక్కొక్కరికి 5000 రూ. జరిమానా,ఇద్దరికి మూడు రోజుల జైలు శిక్ష, ఒక్కొక్కరికి 5000 రూపాయల జరిమానా,ఇద్దరికి ఒక్కొక్కరికి 10,000 రూపాయల జరిమాన.జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా నిర్వహిస్తున్న అరైవ్ – అలైవ్ కార్యక్రమంలో భాగంగా మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల కలిగే ప్రమాదాలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు గురై కుటుంబాలను రోడ్డున పడేయొద్దని, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం వల్ల తమతో పాటు ఎదురుగా వచ్చే వారి కుటుంబాల్లో కూడా విషాదం నింపవద్దని హెచ్చరించారు.మద్యం సేవించి కేసుల పలు అయితే భవిష్యత్తులో ఉద్యోగ మరియు ఉపాధి అవకాశాలపై ప్రభావం పడే అవకాశం ఉందని, పోలీస్ వెరిఫికేషన్ సమయంలో ఇబ్బందులు తలెత్తవచ్చని హెచ్చరించారు.అలాగే ట్రాఫిక్ మరియు రోడ్ భద్రత నియమ నిబంధనలను ఉల్లంఘించే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.జిల్లా వ్యాప్తంగా ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు,వాహన తనిఖీలు నిర్వహించడం జరిగుతుందని,మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

# లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణి చేసిన వేముల సుభాష్

## పలు కుటుంబాలకు పరామర్శ



జగిత్యాల/ బుగ్గారం: (తెలంగాణ వాణి) వెలుగొండ యశ్వంతరావు పేట గంగాపూర్ గ్రామాల్లో లబ్ధిదారులైనటువంటి అభ్యర్థులకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వేముల సుభాష్ సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందచేశారు. అనంతరం మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల మరణించిన బాధిత కుటుంబాలను పరామర్శించి, వారికి ప్రభుత్వం ద్వారా తగిన ఆర్థిక సహాయం అందిస్తానని ధైర్యం చేకూర్చారు. యశ్వంతరావు పేటలో చదును చేస్తున్న బీట్ స్థలాన్ని పరిశీలించి రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సౌకర్యం కల్పించాలంటూ యశ్వంతరావు పేట గ్రామ సర్పంచి ఊరు మెట్ల లక్ష్మి బుచ్చయ్య తో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వేముల సుభాష్ తో తాంద్ర సత్యనారాయణ రావు, వెలుగొండ మాజీ సర్పంచ్ కొండపల్లి సంతోష్ రావు, వెలుగొండ గ్రామ శాఖ అధ్యక్షులు కస్తూరి మల్లేశం, గ్రామ సర్పంచ్ నీలం నందిని సంతోష్, మద్నూర్ మాజీ సర్పంచ్ బత్తుల తిరుపతి, బండారు మహేష్, సమీద్, రెంటం శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కాంగ్రెస్ కోశాధికారిగా "కోదుమూరి" నియామకం



కొత్తగూడెం (తెలంగాణ వాణి) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ కమిటీ కోశాధికారిగా చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కోదుమూరు శ్రీనివాస్ ను నియమిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు దేవి ప్రసన్న ఈ మేరకు శ్రీనివాస్ కు నియామకపు ఉత్తరువు కాపీలను అందజేయడం జరిగింది. రాష్ట్ర దాల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కొనసాగుతున్న శ్రీనివాసును కాంగ్రెస్ పార్టీలో కీలక బాధ్యతలు అప్పగించడం పట్ల కాంగ్రెస్ శ్రేణులు సర్వత్ర హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతూ పార్టీకి నమ్మకస్తుడిగా పని చేశారు. కోడుమూరు శ్రీనివాసును కాంగ్రెస్ పార్టీ ని మార్పించాలని ఇతర పార్టీల నాయకులు ఎంతగానో ప్రయత్నించినప్పటికీ ఆయన అందుకు అంగీకరించలేదు. తాను కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతానని, తనకు పదవులు ముఖ్యం కాదని తన చిన్నతనం నుంచి అదే పార్టీలో కొనసాగానని సున్నితంగా సమాధానం చెప్పి పంపించేవారు. జిల్లా కాంగ్రెస్ పార్టీలో కోశాధికారిగా నియమించడం పట్ల దాల్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు, వ్యాపారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# రక్తదానంతో సేవా స్ఫూర్తి ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి



నారాయణఖేడ్, ఏప్రిల్ 18: (తెలంగాణ వాణి ప్రతినిధి) శాంతిభద్రతల పరిరక్షణతో పాటు సామాజిక బాధ్యతగా 'అరైవ్ అలైవ్' వంటి కార్యక్రమాల ద్వారా రక్తదాన శిబిరం నిర్వహించడం అభినందనీయమని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టిన 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో భాగంగా నారాయణఖేడ్ పట్టణ పోలీస్ స్టేషన్లో శనివారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం విజయవంతంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నారాయణఖేడ్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ సహకారంతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు.రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలని సూచిస్తూ, వాహనం నడుపుతున్నప్పుడు ఫోన్ మాట్లాడకూడదని, మద్యం సేవించి డ్రైవింగ్ చేయకూడదని హెచ్చరించారు. ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు.త్వరలోనే నియోజకవర్గంలో డ్రైవింగ్ లైసెన్స్ డ్రైవ్ మరియు ఇన్సూరెన్స్ మేళాలు నిర్వహిస్తామని, ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.అలాగే ప్రతి ఆరోగ్యవంతుడైన యువకుడు రక్తదానం చేయడానికి ముందుకు రావాలని, రక్తదానం వల్ల ఆరోగ్యానికి ఎలాంటి నష్టం లేదని, పైగా కొత్త రక్తం ఏర్పడి శరీరం మరింత ఉత్సాహంగా మారుతుందని చెప్పారు.ఈ కార్యక్రమంలో నారాయణఖేడ్ డీఎస్పీ వెంకట్ రెడ్డి, సిఐలు శ్రీనివాస్ రెడ్డి, వెంకట్ రెడ్డి, ఎస్సైలు శ్రీశైలం, రామకృష్ణ, వెంకటేశ్వరరావు, దుర్గా రెడ్డి, పోలీస్ సిబ్బంది, లయన్స్ క్లబ్ నారాయణఖేడ్ అధ్యక్షులు సాయి సంగమేశ్వర్, బాద్యులు శేఖర్, రాజు, యూసుఫ్, వైద్య సిబ్బంది, కౌన్సిలర్లు బాణాపురం రాజు, షారుఖ్ ఖాన్, మహేష్ చౌహన్, సుబుర్ మరియు రక్తదానం చేసిన స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు.

# ప్రజల నిర్ణయమే ఫైనల్ ఎమ్మెల్యే జిఎంఆర్

## అమీన్పూర్ ఎస్టిపిని తరలిస్తాం లేదా రద్దు చేస్తాం

## అవసరమైతే ముఖ్యమంత్రితో సైతం చర్చిస్తాము



పటాన్ చెరు (తెలంగాణ వాణి రిపోర్టర్) ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగా అమీన్పూర్ లో ఏర్పాటు చేయదలచిన సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ (ఎస్టిపి ) ను తరలించడం లేదా రద్దు చేయడం జరుగుతుందని.. ప్రజలు ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. శనివారం ఉదయం అమీన్పూర్ డివిజన్ పరిధిలోని 993 సర్వే నంబర్లో ఎస్ టి పి ఏర్పాటు చేయనున్న స్థలంలో శనివారం ఆయా కాలనీల ప్రజలతో ఎమ్మెల్యే జిఎంఆర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న అమీన్పూర్ పరిధిలోని మురుగు నీటి జలాలను శుద్ధి చేయాలన్న లక్ష్యంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంతో ఎస్టిపి ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఈ ప్లాంట్ ఏర్పాటు ద్వారా తమకు అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని స్థానిక కాలనీల ప్రజల నుండి పెద్ద ఎత్తున అభ్యంతరాలు తలెత్తుతున్న నేపథ్యంలో.. మెజార్టీ ప్రజలు, స్థానిక మాజీ ప్రజాప్రతినిధుల అభిప్రాయానికి అనుగుణంగా ఎస్టిపిని తరలించడం లేదా రద్దు చేసేందుకు ప్రభుత్వంతో చర్చించనున్నట్లు తెలిపారు. అవసరమైన పక్షంలో ముఖ్యమంత్రి దృష్టికి సైతం తీసుకుని వెళ్లడం జరుగుతుందని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అమీన్పూర్ లో ఎస్టీపీని ఏర్పాటు చేయడం జరగదని స్పష్టం చేశారు. అత్యంత అవసరమైతే ప్రత్యేక పైపులైను ఏర్పాటు చేసి నక్క వాగులోకి తరలించడం జరుగుతుందని తెలిపారు. పనులను వెంటనే నిలిపివేయాలని సంబంధిత అధికారులను, కాంట్రాక్టర్ ను ఆదేశించారు. ప్లాంట్ ఏర్పాటుపై రాజకీయాలు చేయడం మానుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో అమీన్పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, అమీన్పూర్ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్, జలమండలి సిజిఎం పద్మజ, జిఎం సుబ్బారాయుడు, మాజీ ప్రజా ప్రతినిధులు, ఆయా కాలనీల ప్రజలు పాల్గొన్నారు.

# ఏఐ సాంకేతికతను ప్రతి ఒక్కరూ అవలంబించాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష
- శిక్షణలను సద్వినియోగం చేసుకుని పనిలో ప్రతిఫలింపజేయాలి
- ప్రభుత్వ సేవలను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా అందించాలి



పెద్దపల్లి (తెలంగాణ వాణి ప్రతినిధి) పెద్దపల్లి జిల్లాలో నిర్వహించిన ఏఐ శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, నూతన సాంకేతిక పరిజ్ఞానాలను స్వీకరించడం ద్వారా పనుల్లో వేగం పెరగడంతో పాటు సమయాన్ని ఆదా చేయవచ్చని ప్రతి ఒక్కరూ ఏఐ వంటి ఆధునిక సాంకేతికతను నేర్చుకుని, తమ దైనందిన విధుల్లో అమలు చేయాలని సూచించారు. శిక్షణ కార్యక్రమాలను కేవలం హాజరు పరిమితంగా కాకుండా, అందులో నేర్చుకున్న విషయాలను పనిలో ప్రతిఫలింపజేయాలని అన్నారు.ప్రభుత్వ సేవలను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా అందించేందుకు సాంకేతిక పరిజ్ఞానం కీలక పాత్ర పోషిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజలకు త్వరితగతిన, నాణ్యమైన సేవలు అందించే దిశగా అధికారులు కృషి చేయాలని ఆదేశించారు.శిక్షణ కార్యక్రమాలకు సమయపాలనతో హాజరై, పూర్తి స్థాయిలో పాల్గొనాలని, నేర్చుకునే మనస్తత్వాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు , కలెక్టరేట్ పరిపాలన అధికారి బండి ప్రకాష్ ,సంబంధిత అధికారులు,అన్నీ శాఖల సిబ్బంది, తదితరులు, పాల్గొన్నారు.

# యువత ఉత్సాహంలో గాయత్రి క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్

## వనమా "రాఘవేందర్" చేతుల మీదుగా బహుమతుల ప్రదానం



పాల్వంచ (తెలంగాణ వాణి) గాయత్రి క్రికెట్ టోర్నమెంట్ చివరి రోజు నిర్వహించిన ఫైనల్ మ్యాచ్ ప్రేక్షకులను ఉత్కంఠకు గురిచేస్తూ హోరాహోరిగా సాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వనమా రాఘవేందర్ హాజరై, విజేతగా నిలిచిన "స్టాలిన్ లెవన్" జట్టుకు గాయత్రి క్రికెట్ టోర్నమెంట్ కప్తో పాటు రూ.30,000 నగదు బహుమతిని తన చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా రాఘవేంద్రరావు మాట్లాడుతూ, యువత క్రీడలపై ఆసక్తి చూపడం సమాజానికి ఎంతో మేలు చేస్తుందని పేర్కొన్నారు. క్రీడలు శారీరక దృఢత్వం మాత్రమే కాకుండా క్రమశిక్షణ, ఐక్యత, సహనాన్ని పెంపొందిస్తాయని అన్నారు. గాయత్రి క్రికెట్ టోర్నమెంట్ను విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులను అభినందించారు. అలాగే ఇలాంటి క్రీడా పోటీలు యువతలో ప్రతిభను వెలికి తీసేందుకు మంచి వేదికగా నిలుస్తాయని చెప్పారు. ఇటువంటి భారీ టోర్నమెంట్లకు రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర సాకారంతో నిర్వహించబడటం ఎంతో సంతోషకరమని తెలిపారు. వారి ప్రోత్సాహం వల్లే ఇలాంటి కార్యక్రమాలు విజయవంతంగా జరుగుతున్నాయని కొనియాడారు.విజేతలతో పాటు పోటీలో పాల్గొన్న ప్రతి జట్టును అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్పర్సన్ కాపు సీతాలక్ష్మి, మాజీ ఎంపీపీ బాధవత్ శాంతి, బీఆర్ఎస్ నాయకులు భీమా శ్రీధర్, కొత్తగూడెం కార్పొరేటర్లు బత్తుల మధుచంద్, మల్హోత్రా సాగర్, గుగులోత్ రాంబాబు, టిబిజీకెఎస్ జనరల్ సెక్రటరీ కాపు కృష్ణ, అదేవిధంగా క్రికెట్ నిర్వహకులు కన్నీ, బీ శ్రీనివాస్, బొమ్మిడి శ్రీకాంత్, బొమ్మిడి రమాకాంత్, బీఆర్ఎస్ మహిళా నాయకులు బట్టు మంజుల, మాదాసు పద్మ, డీకొండ సునీత, మద్దెల మహేష్, మాజీ కౌన్సిలర్ అంబుల వేణు,ఖాజా, పూర్ణ,పాషా, పాత కొత్తగూడెం నాగబాబు, చింతలపూడి జగన్,గాజుల కృష్ణ, శ్రీకృష్ణ, విజయ్, మద్దెల సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

# అందరి క్షేమాన్ని కోరుకునేది హిందూ ధర్మం మాత్రమే

## ఈనెల 26న కొత్తగూడెంలో భారీ హిందూ సమ్మేళనం సభ



కొత్తగూడెం (తెలంగాణ వాణి) అన్ని వర్గాల ప్రజల సంక్షేమాన్ని కోరుకునేది కేవలం హిందూ ధర్మమేనని హిందూ సమ్మేళన ఉత్సవ కమిటీ నాయకులు పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని రైటర్ బక్తీలో గల వనవాసి కళ్యాణ ఆశ్రమం లొ నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హిందూ ధర్మం అనేది సమస్త ప్రజల క్షేమాన్ని కోరుకునే జీవన విధానం అని పేర్కొన్నారు. హిందూ ధర్మం, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు కట్టుబడి ఉందన్నారు. హిందూ సమాజం ఆధ్వర్యంలో ఈ నెల 26న కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో భారీ ఎత్తున హిందూ సమ్మేళనం సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమ్మేళనం యొక్క ప్రధాన ఉద్దేశ్యం హిందూ సమాజంలో ఐక్యతను బలోపేతం చేయడం, యువతలో ధార్మిక, సాంస్కృతిక అవగాహన పెంపొందించడం, మన సంప్రదాయ విలువలను భవిష్యత్ తరాలకు చేరవేయడం అని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ధార్మిక నాయకులు, పండితులు, సామాజిక కార్యకర్తలు పాల్గొని హిందూ ధర్మం, సంస్కృతి మరియు ప్రస్తుత సమాజంలో ఎదురవుతున్న సవాళ్లపై ఉపన్యాసాలు అందించనున్నట్లు తెలిపారు.అలాగే కార్యక్రమంలో భాగంగా భజనలు, సాంస్కృతిక ప్రదర్శనలు, పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విద్యానగర్ సాయిబాబా దేవాలయం నుండి పాలకేంద్ర హనుమాన్ దేవాలయం వరకు బైక్ ర్యాలీ కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా హిందూ సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు పి. వర్ధన్ రావు, కార్యదర్శి లట్టి జగన్మోహన్ రావు, సభ్యులు యెలదండి పూర్ణచంద్రరావు, పలివెల సాంబశివరావు, గోపాల్ పంచారియా, బండి భాస్కర్, మనీష్ అగర్వాల్, దారా రమేష్, న్యాయవాది పాతూరి విఠల్, సురేష్, అప్పారి లక్ష్మణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుల పోరాటానికి ఎస్సిఈయు సంఘీభావం



రామకృష్ణాపూర్ (తెలంగాణ వాణి): ఏరియా ఎస్ అండ్ పిసి విభాగంలో టెండర్ రద్దు కారణంగా రోడ్డున పడ్డ 220 ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులకు విధులు కల్పించాలని కోరుతూ ఏరియాలోని ప్రైవేట్ సింగరేణి సెక్యూరిటీ గార్డులు గత 12 రోజులుగా చేస్తున్న పోరాటానికి సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) తమ పూర్తి సంఘీభావాన్ని తెలుపుతుందని యూనియన్ బ్రాంచ్ అధ్యక్షుడు ఎస్ వెంకటస్వామి తెలిపారు. శనివారం సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో సెక్యూరిటీ గార్డులు ఏరియాలోని ఆర్కేపి సిహెచ్పీ లో శాంతియుతంగా ప్లకార్డులు ధరించి, నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమంలో ఎస్సిఈయు నాయకులు పాల్గొని, సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సిఈయు బ్రాంచ్ అధ్యక్షుడు వెంకటస్వామి మాట్లాడుతూ, గత పది రోజులుగా కాంట్రాక్ట్ కార్మికులు వివిధ పద్ధతుల్లో ఆందోళన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. వారి ఆందోళన కార్యక్రమాలకు స్పందించిన రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి స్పందిస్తూ, కొత్త టెండర్లను ఎలాంటి షరతులు లేకుండా, కొత్త నిబంధనలు లేకుండా, పాత వారిని తీసుకోవాలని స్థానిక ఏరియా జిఎం కు సూచించడం జరిగిందన్నారు. దాని ప్రకారం స్థానిక జిఎం స్పందించి, ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బందికి భరోసా కల్పిస్తూ, వారి ఆందోళనలకు తెర దించేలా చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. కొత్త టెండర్ లో పోస్టుల సంఖ్యను 90 కి తగ్గకుండా, పాత విధంగా 126 పోస్టులకు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో అన్ని కార్మిక సంఘాలను కలుపుకొని, పోరాటం మరింత ఉద్ధృతంగా నిర్వహించడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సికెఎస్(సిఐటియు) రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్, నాయకులు గుజ్జ సతీష్, పంగ మల్లేష్, అలవాల సంజీవ్, సిహెచ్పి కార్మికులు, ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు పాల్గొన్నారు.

# అర్హులైన జర్నలిస్టులకే అక్రిడిటేషన్లు

## నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

**జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**



నిర్మల్ (తెలంగాణ వాణి ప్రతినిధి) జిల్లాలో నిబద్ధతతో పనిచేస్తున్న నిజమైన జర్నలిస్టులందరికీ ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల మేరకు అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేస్తామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ స్పష్టం చేశారు. నూతనంగా ఏర్పాటైన జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు శనివారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అక్రిడిటేషన్ల జారీ ప్రక్రియలో పారదర్శకతకు పెద్దపీట వేయాలని, అర్హత గల ప్రతి విలేకరికి కార్డు అందేలా చూడాల్సిన బాధ్యత జిల్లా పౌర సంబంధాల అధికారి (డిపిఆర్ఓ), కమిటీ సభ్యులపై ఉందన్నారు. అక్రిడిటేషన్ కార్డుల మంజూరుకు సంబంధించి ప్రభుత్వం విడుదల చేసిన జీవోలోని మార్గదర్శకాలను కలెక్టర్ ఈ సందర్భంగా వివరించారు. ముఖ్యంగా క్రిమినల్ నేపథ్యం ఉన్న వ్యక్తులు, ప్రభుత్వ ఉద్యోగులు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ సిబ్బందికి కార్డులు జారీ చేయకూడదని ఆమె ఆదేశించారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే తుది నిర్ణయం తీసుకోవాలని, త్వరలోనే జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కమిటీ పూర్తిస్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి ఇ. విష్ణువర్ధన్, కమిటీ సభ్యులు అల్వాల హనుమంతు, కొండూరి రవీందర్, అల్లం అశోక్, ఆర్. మహేందర్, ఎం.ఏ. వసీం, రామెళ్ళ రాజేశ్వర్, సిరిపురం నాగరాజు, ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# 12వ వేతన సవరణ కమిటీ ( జేబీసీసీఐ)ను

# వెంటనే ఏర్పాటు చేయాలి

**కేంద్ర మంత్రి లేఖ ఏబికెఎంఎస్- బి ఎం ఎస్ నాయకులు**



కొత్తగూడెం సింగరేణి (తెలంగాణ వాణి) బొగ్గు పరిశ్రమలో పనిచేస్తున్న కార్మిక వర్గానికి సంబంధించి12వ వేతన సవరణ ఒప్పంద కమిటీని తక్షణం ఏర్పాటు చేయాలని బిఎంఎస్ అనుబంధ ఏబీకేఎంఎస్ జాతీయ కార్యదర్శి పి.మాధవ్ నాయక్ డిమాండ్ చేశారు. శనివారం సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ ఆధ్వర్యంలో కార్పొరేట్ ఏరియాలోని సెంట్రల్ వర్క్ షాప్ వద్ద జరిగిన గేట్ మీటింగ్ లొ పాల్గొని ఆయన మాట్లాడారు. ఫిట్ సెక్రటరీ భూపతి రాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. 12వ వేతన సవరణ కమిటీని వెంటనే ఏర్పాటు చేసి నోటిఫికేషన్ జారీ చేయాలని డిమాండ్ చేశారు. 11వ వేతన కమిటీ కాలపరిమితి ఏడాది జూన్ 30వ తేదీతో 3 ముగియనున్నందున జూలై 1 నుండి నుండి 12వ వేతన సవరణ నూతన కమిటీని తక్షణమే ఏర్పాటు చేయాలని కోరారు.

కార్మికుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న భారతీయ మజ్దూర్ సంఘ్ ( బిఎంఎస్), రాజకీయాలకు అతీతంగా కార్మిక హక్కుల కోసం పోరాడుతోందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర బొగ్గు,గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డికి 12వ వేతన కమిటీ ఏర్పాటు విషయమై లేఖను పంపినట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా వారం రోజులపాటు బొగ్గు గనుల ప్రాంతాల్లో గేట్ మీటింగ్‌లు నిర్వహిస్తూ ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేయడానికి కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలోనే సింగరేణి సంస్థలో బొగ్గు ఉత్పత్తి తగ్గడానికి, కొత్త గనులు రాకపోవడానికి కొన్ని కార్మిక సంఘాల వైఖరి కారణమైందని విమర్శించారు. గతంలో బొగ్గు గనుల వేలంలో పాల్గొనకుండా రాజకీయ కారణాలతో తీసుకున్న నిర్ణయాలు సింగరేణికి నష్టాన్ని కలిగించాయని పేర్కొన్నారు. బొగ్గు గనుల వేలం ద్వారా కొత్త గనులు పొందడమే సంస్థకు లాభసాటిగా ఉంటుందని బిఎంఎస్ 2020 నుంచే స్పష్టంగా చెబుతూ వస్తోందని గుర్తు చేశారు. అదేవిధంగా సింగరేణికి రావలసిన సుమారు రూ. 53,000 కోట్ల బకాయిలను రాష్ట్ర ప్రభుత్వ సంస్థలైన ట్రాన్స్కో, జెన్‌కో నుంచి వసూలు చేయడంలో కొన్ని సంఘాలు పూర్తిగా విఫలమయ్యాయని తీవ్రంగా విమర్శించారు. కార్మిక సమస్యలపై రెండు సంవత్సరాలుగా స్పందన లేకుండా ఉన్న గుర్తింపు సంఘమైన ఏఐటీయూసీ ఇప్పుడు కొత్తగా ఆందోళనల పేరుతో కార్మికులను మళ్లీ తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షులు బి. రాంసింగ్, ఆఫీస్ కార్యదర్శి మారేపల్లి శ్రీనివాస్, కార్పొరేట్ ఏరియా జాయింట్ సెక్రటరీ బి. భీమా, అసిస్టెంట్ పిట్ సెక్రటరీ వీర కుమార్, పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సంగం చందర్, జాయింట్ సెక్రటరీ అల్లి ప్రకాష్, రాజమౌళి, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ఇంపనూరి నాగేశ్వరరావు, సింగరేణి కోల్ మైన్స్ కాంట్రాక్టు మజ్దూర్ సంఘ్‌కు చెందిన రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ వారోత్సవాలు

## సమర్థవంతంగా నిర్వహించాలి

**రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు**



నిర్మల్ (తెలంగాణ వాణి ప్రతినిధి) రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా, ఈ నెల 20 వ తేదీ నుండి, 26 వ తేదీ వరకు 7 రోజుల పాటు సంక్షేమ వారాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, పలు శాఖల అధికారులతో సంక్షేమ వారం నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ, 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో భాగంగా ఈ నెల 20వ తేదీ నుండి 26వ తేదీ వరకు ప్రభుత్వ వసతి గృహాలు, గురుకుల పాఠశాలలు, ప్రభుత్వ వసతి గృహాలు, విద్యాలయాలలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని తెలిపారు. విద్యార్థులకు క్విజ్, పెయింటింగ్ లాంటి పోటీలు నిర్వహించాలని పేర్కొన్నారు. వసతి గృహాలలో మరమ్మత్తు పనులను చేపట్టాలని తెలిపారు. ప్రత్యేక నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని, వేసవి శిబిరం, బడిబాట కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. రైతు రిజిస్ట్రేషన్ వంద శాతం పూర్తి చేయాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, కలెక్టరేట్లోని సమావేశ మందిరం నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజాపాలన - ప్రగతి -ప్రణాళిక కార్యాచరణలో ఈనెల 20వ తేదీ నుండి 26వ తేదీ వరకు 7 రోజుల పాటు ప్రజా భాగంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలోని ఎస్సి, ఎస్టి, బిసి, మైనారిటీ గురుకులాలలో, వసతి గృహాలలో పారిశుధ్యం, మరమ్మత్తు పనులు చేపడుతామని తెలిపారు. విద్యార్థులకు వివిధ విభాగాలలో పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రత్యేక నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. వేసవి శిబిరాలు, బడిబాట కార్యక్రమాలను జిల్లాలో అధికారుల సమన్వయంతో పకడ్బందీగా చేపడతామని, రైతుల రిజిస్ట్రేషన్ వంద శాతం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, సిపిఓ జీవరత్నం, జిల్లా సంక్షేమ అధికారి వినూత్న, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖల అధికారులు దయానంద్, అంబాజీ, శ్రీనివాస్, మోహన్ సింగ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శంకర్, డీఈవో భోజన్న, జెడ్పి సీఈవో భాగ్యలక్ష్మి, డిఎంహెచ్వో రాజేందర్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మహిళల రిజర్వేషన్ ముసుగులో బీజేపీ రాజకీయ కుట్ర

**దక్షిణ రాష్ట్రాల ప్రాతినిధ్యాన్ని తగ్గించే కేంద్ర యత్నం!**

**తెలంగాణాలో మళ్లి కాంగ్రెస్ ప్రభుత్వం వస్తుంది**

**బోథ్ నియోజకవర్గం ఇంచార్జి ఆడే గజేందర్!**



బోథ్,ఏప్రిల్ 18(తెలంగాణా వాణి ప్రతినిధి): మహిళల సాధికారత పేరుతో ప్రచారం చేసిన మహిళల రిజర్వేషన్ బిల్లును అమలు చేయడంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆడే గజేందర్ తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు బోథ్ బ్లాక్ ఆత్మ చైర్మన్ గొర్ల రాజు యాదవ్, మాజీ ప్యాక్స్ డైరెక్టర్ చట్ల ఉమేష్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నరసింహా దాస్,కాంగ్రెస్ యువ నాయకుడు అలపాటి అచ్యుతానంద రెడ్డి సంయుక్తంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. బిల్లు ఆమోదం పేరుతో దేశ ప్రజలను నమ్మబలికిన కేంద్ర ప్రభుత్వం, అమలు దశలో మాత్రం స్పష్టమైన చర్యలు తీసుకోలేకపోవడం వారి అసలు ఉద్దేశాన్ని బయటపెట్టిందని పేర్కొన్నారు. మహిళలకు తక్షణ రిజర్వేషన్ కల్పించాల్సిన సమయంలో, ముందుగా జనగణన,అనంతరం నియోజకవర్గాల పునర్విభజన వంటి షరతులు విధించడం ద్వారా బిల్లును ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేస్తున్నారని ఆరోపించారు. 2024 ఎన్నికల నాటికి అమలు చేయాల్సిన ఈ బిల్లును కావాలనే వాయిదా వేసి మహిళలను మోసం చేసినట్లు విమర్శించారు. మహిళల సాధికారతను కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకుంటున్నారని మండిపడ్డారు. నియోజకవర్గాల పునర్విభజన పేరుతో కేంద్రం అసలు రాజకీయ లాభాలే లక్ష్యంగా పెట్టుకుందని, దీని వల్ల దక్షిణ భారత రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు. జనాభా ఆధారంగా స్థానాల పునర్విభజన జరిగితే అధిక జనాభా ఉన్న ఉత్తర రాష్ట్రాలకు అధిక ప్రాతినిధ్యం లభిస్తుందని, విద్య, ఆరోగ్యం, కుటుంబ నియంత్రణలో ముందున్న దక్షిణ రాష్ట్రాలు తమ ప్రాధాన్యత కోల్పోతాయని తెలిపారు. జనాభాను నియంత్రించిన దక్షిణ రాష్ట్రాలకు ఇది శిక్షగా,జనాభా పెరిగిన రాష్ట్రాలకు బహుమతిగా మారుతుందని విమర్శించారు. దేశ ఆర్థికాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న దక్షిణ రాష్ట్రాల స్వరం పార్లమెంటులో తగ్గిపోవడం దేశ సమతౌల్యానికి ప్రమాదకరమని పేర్కొన్నారు. అలాగే, నియోజకవర్గాల పునర్విభజన కమిషన్‌పై కేంద్రానికి పూర్తి నియంత్రణ ఉండటం ప్రజాస్వామ్యానికి ముప్పుగా మారుతుందని,రాజకీయ ప్రయోజనాల కోసం నియోజకవర్గాల సరిహద్దులను మార్చే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

మహిళల పేరుతో రాజకీయ లాభాల కోసం ప్రయత్నించి, చివరకు బిల్లును అమలు చేయడంలో విఫలమైన కేంద్ర ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎలాంటి షరతులు లేకుండా మహిళల రిజర్వేషన్‌ను వెంటనే అమలు చేయాలని కోరారు. లేకపోతే, ఈ బిల్లు మహిళల సాధికారత కోసం కాదు, అధికారాన్ని నిలబెట్టుకునే రాజకీయ ఆయుధమని దక్షిణ రాష్ట్రాల ప్రజలు బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

# బోథ్ నియోజకవర్గానికి అదనపు

# ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయండి

**రాష్ట్ర మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ని కోరిన ఆడే గజేందర్**



బోథ్ (తెలంగాణా వాణి ప్రతినిది) బోథ్ నియోజకవర్గ ప్రజల గృహ సమస్యలను పరిష్కరించేందుకు అదనపు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేయాలని కోరుతూ రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ని మాజీ మంత్రి వేణుగోపాల్ చారితో కలిసి బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్ కోరారు. ఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లాడుతూ బోథ్ నియోజకవర్గంలో పేద, అవసరమైన కుటుంబాలు ఇంకా ఇళ్ల కోసం ఎదురుచూస్తున్నాయని వారికి గృహ వసతి కల్పించడం అత్యవసరమని మంత్రికి వివరించారు ముఖ్యంగా అర్హులైన లబ్ధిదారులకు అదనపు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ, ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందని,బోథ్ నియోజకవర్గానికి సంబంధించిన ప్రతిపాదనలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ గొర్ల రాజు యాదవ్, మాజీ బోథ్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నరసింహ దాస్, మాజీ ప్యాక్స్ డైరెక్టర్ చట్ల ఉమేష్, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం పోతారెడ్డి, అచ్యుతానంద రెడ్డి, యండి సద్దాం, హీరా సింగ్, రాహిల్ తదితరులు ఉన్నారు.

# సంక్షేమ వారోత్సవాలను

# విజయవంతంపై వీడియో కాన్ఫరెన్స్



ఆదిలాబాద్, ఏప్రిల్ : 18 ( తెలంగాణ వాణి (ప్రతినిధి) ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా ఏప్రిల్ 20వ తేదీ నుంచి 26వ తేదీ వరకు నిర్వహించనున్న సంక్షేమ వారోత్సవాలను విజయవంతం చేయాలని జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్ ఆదేశించారు. శనివారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక సంక్షేమ వారోత్సవాల నిర్వహణపై హైదరాబాదు నుంచి, అన్ని జిల్లాల కలెక్టర్లతో సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా ఏప్రిల్ 20వ తేదీ నుంచి 26వ తేదీ వరకు నిర్వహించనున్న సంక్షేమ వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. వారం రోజులపాటు ప్రతిరోజు సంక్షేమ వారోత్సవాల్లో భాగంగా నిర్దేశించిన కార్యక్రమాలను పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. అదేవిధంగా అన్ని జిల్లాల్లో వ్యవసాయ శాఖ పరిధిలో కొనసాగుతున్న ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను వేగవంతం చేసి వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. వీసీ అనంతరం జిల్లా అధికారులతో ఇంచార్జ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా ఏప్రిల్ 20వ తేదీ నుంచి 26వ తేదీ వరకు నిర్వహించనున్న సంక్షేమ వారోత్సవాలను పక్కాగా నిర్వహించేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వారోత్సవాల్లో భాగంగా మొదటి రోజైన ఏప్రిల్ 20వ తేదీన జిల్లాలోని అన్ని సంక్షేమ హాస్టళ్లు, విద్యాసంస్థల్లో శానిటేషన్ డ్రైవ్ చేపట్టాలని సూచించారు. రెండో రోజు విద్యార్థులకు టాలెంట్ ఫెస్టివల్ పేరుతో క్విజ్, డిబేట్ వంటి కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. మూడో రోజున అన్ని సంక్షేమ వసతి గృహాలు, విద్యాసంస్థల్లో ఏమైనా మరమ్మతులు చేయాల్సి ఉంటే వాటిని పూర్తిచేయాలని ఆదేశించారు. నాలుగో రోజున విద్యార్థుల తల్లిదండ్రులను పాఠశాలకు ఆహ్వానించి ప్రభుత్వం విద్యార్థుల కోసం అమలు చేస్తున్న సౌకర్యాలపై వివరించాలని తెలిపారు. తదుపరి రోజుల్లో విద్యార్థులకు స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాలు, సమ్మర్ క్యాంప్స్, బడిబాట కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఆర్ఎస్ చిత్రు (రెవెన్యూ) జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ రాష్ట్రీయ సమ్మాన్ పురస్కారం

# అందుకున్న భీమ్ పుత్ర శ్రీనివాస్



రామకృష్ణాపూర్ (తెలంగాణ వాణి) పట్టణంలోని ఫిల్టర్ బెడ్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల (ఎంపిపిఎస్) ఉపాధ్యాయుడు డాక్టర్ భీం పుత్ర శ్రీనివాస్ జలంపల్లి ప్రతిష్టాత్మక గ్లోబల్ ఐకాన్స్ అఫ్ ఇండియా ఈ-మ్యాగజైన్స్ లో చోటు సంపాదించడం తోపాటు గ్లోబల్ ఐకాన్స్ అఫ్ ఇండియా వారి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాష్ట్రీయ సమ్మాన్ - 2026 పురస్కారాన్ని సైతం అందుకున్నారు. ఈ మేరకు భీం పుత్ర శ్రీనివాస్ ను అభినందిస్తూ, నిర్వాహకులు అవార్డును అందించడం తోపాటు సర్టిఫికెట్, మెడల్, జ్ఞాపికను శనివారం పోస్టు ద్వారా అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు భీం పుత్ర శ్రీనివాస్ కు సంబంధించి తమ మ్యాగజైన్ లో కథనాన్ని సైతం ప్రచురించారు. మండలంలో నివసిస్తున్న డాక్టర్ భీంపుత్ర శ్రీనివాస్ జలంపెల్లి విద్యా రంగంలో 25 సంవత్సరాలకు పైగా సేవలందించిన అంకితభావం గల, అనుభవజ్ఞుడైన ఉపాధ్యాయుడిని కొనియాడారు. విద్యార్థులతో స్నేహపూర్వకంగా వ్యవహరించే విధానానికి ప్రసిద్ధి చెందిన ఆయన, పాఠశాల యూనిఫాంలో విద్యార్థులతో పాటు బోధించడం ద్వారా క్రమశిక్షణను, సమానత్వాన్ని ప్రోత్సహిస్తూ, యూనిఫాం టీచర్ గా ప్రాచుర్యం పొందారని తెలిపారు. క్షేత్రస్థాయి పని, ఆచరణాత్మక అభ్యాసం, చేస్తూ నేర్చుకోవడం, వంటి వినూత్న బోధనా పద్ధతులలో ఆయనకు నైపుణ్యం కాలదన్నారు. అదే విధంగా భీం పుత్ర శ్రీనివాస్ విద్యా విషయాలకు అతీతంగా, కోవిడ్-19, ఆరోగ్య విద్య, అవయవ, శరీర దానం వంటి సామాజిక అవగాహన కార్యక్రమాలలో సైతం చురుకుగా పాల్గొంటున్నారని తెలిపారు. అనేక పురస్కారాలతో సత్కరించబడిన డాక్టర్ భీం పుత్ర శ్రీనివాస్ జలంపెల్లి విలువ ఆధారిత విద్య, సామాజిక బాధ్యత, సంపూర్ణ అభివృద్ధి పట్ల తనకున్న నిబద్ధతతో యువతకు స్ఫూర్తినిస్తూనే ఉన్నారన్నారు. ఈ సందర్భంగా భీం పుత్ర శ్రీనివాస్ మాట్లాడుతూ, అందరి ఆశీస్సులతో అంబేద్కర్ పేరుతో పురస్కారం లభించడం సంతోషంగా ఉందని, తన వెన్నంటి ఉంటూ, ఎల్లప్పుడూ తనకు సహకరించిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా గ్లోబల్ ఐకాన్స్ అఫ్ ఇండియా నిర్వాహకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రతిష్టాత్మక గ్లోబల్ ఐకాన్స్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాష్ట్రీయ సమ్మాన్ పురస్కారం అందుకున్న భీం పుత్ర శ్రీనివాస్ ను పలువురు అభినందించారు.

## సిబ్బంది విధులలో అంకితభావంతో పనిచేయాలి

**జిల్లా వ్యాప్తంగా ఉన్నపోలీసు సిబ్బందికి సెట్ కాన్ఫరెన్స్ ఏర్పాటు**

**జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**



ఆదిలాబాద్ (తెలంగాణ వాణి ప్రతినిధి) జిల్లా పోలీసు సిబ్బందితో నేరుగా మాట్లాడేందుకు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఉదయం 10:30 గంటలకు సెట్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. సుమారు 30 నిమిషాల పాటు కొనసాగిన ఈ సమావేశంలో జిల్లాలోని అన్ని స్థాయి పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి పోలీసు సిబ్బంది తమ విధులపట్ల అంకితభావం ప్రదర్శిస్తూ, నీతి-నిజాయితీలతో పనిచేయాలని సూచించారు. ఇటీవల జిల్లాలో నిర్వహించిన ముఖ్యమైన బందోబస్తులను విజయవంతంగా పూర్తి చేసినందుకు సిబ్బందిని అభినందించారు. ఎండాకాలం దృష్ట్యా సిబ్బంది ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, తగినంత నీరు తాగడం, ఎండలో బయటకు వెళ్లే సందర్భంలో రక్షణ చర్యలు పాటించాలని సూచించారు. "అరైవ్ అలైవ్" కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేసినందుకు సిబ్బందిని ప్రశంసిస్తూ, రోడ్డు ప్రమాదాల నివారణలో పోలీసుల పాత్రను కొనియాడారు. ప్రజల ప్రాణ నష్టాన్ని తగ్గించడమే ప్రధాన లక్ష్యమని తెలిపారు. పోలీస్ స్టేషన్లలో రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించి పెండింగ్ లేకుండా నిర్వహించాలని, బాధితులతో గౌరవంగా వ్యవహరిస్తూ వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. అసాంఘిక కార్యకలాపాలు, గంజాయి రవాణా, రాయితీ బియ్యం అక్రమ రవాణా వంటి అంశాలపై సమాచారం అందించిన సిబ్బందిని ప్రోత్సహిస్తూ నగదు బహుమతులు అందజేస్తామని తెలిపారు. జిల్లాలో ఓపెన్ డ్రింకింగ్‌ను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కోర్టు డ్యూటీ అధికారుల పనితీరును ప్రతి వారం పర్యవేక్షించి, నేరస్తులకు కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విధుల్లో ఉన్న ప్రతిసారి యూనిఫామ్ ధరించాలని, యూనిఫామ్‌లో ఉన్నప్పుడు మర్యాదపూర్వక ప్రవర్తన పాటించాలని స్పష్టం చేశారు. సిబ్బందికి వారాంతపు సెలవులు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, త్వరలోనే సిబ్బందికి ఆరోగ్య శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. సమాజ భద్రత, శ్రేయస్సు కోసం పోలీసు వ్యవస్థ కట్టుదిట్టంగా పనిచేయాల్సిన అవసరం ఉందని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## వాహనదారులు నిబంధనలు ఖచ్చితంగా పాటించాలి:జిల్లా కలెక్టర్




మంచిర్యాల,ఏప్రిల్ 18 (తెలంగాణ వాణి): వాహనదారులు రహదారి భద్రతా నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని, గమ్యస్థానాలకు సురక్షితంగా చేరుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వేంపల్లి లో గల జిల్లా రవాణా శాఖ అధికారి కార్యాలయ ఆవరణలో అరైవ్ అలైవ్ లో భాగంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి జిల్లా రవాణా అధికారి సిహెచ్. రంజిత్, అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో అరైవ్ అలైవ్ లో భాగంగా ఆటో, లారీల డ్రైవర్లకు వైద్య పరీక్షలు, కంటి పరీక్షలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ వైద్య శిబిరంలో ప్రభుత్వ వైద్య కళాశాల, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులతో దాదాపు 200 మంది డ్రైవర్లకు పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్నవారికి మందులు, కంటి అద్దాలు అందించడం జరిగిందని తెలిపారు. రోడ్లపై ప్రయాణించే సమయంలో రక్షణ ముఖ్యమని, ప్రతి వాహనదారుడు లైసెన్స్ కలిగి ఉండాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారులో ప్రయాణించేవారు సీటు బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని తెలిపారు. వాహనం నడిపే సమయంలో వేగ పరిమితి అనుసరించాలని, మద్యం సేవించి, మొబైల్ మాట్లాడుతూ వాహనం నడపకూడదని తెలిపారు. ప్రజల రక్షణలో భాగంగా వాహనదారులు ఎలాంటి కంటి సమస్యలు లేకుండా చూసుకోవాలని, వాహనాలు నడిపే వారికి కంటిచూపు అత్యవసరమని, కంటి పరీక్షలు నిర్వహించిన వారిలో అవసరం ఉన్నవారికి శస్త్రచికిత్స చేయడం జరుగుతుందని తెలిపారు. రోడ్డు ప్రమాదం అంటే ఒక కుటుంబానికి జరిగే ప్రమాదమని తెలిపారు. జిల్లాలో రహదారులపై లైట్లు, బ్లైండ్ స్పాట్లను గుర్తించి తగు ఏర్పాట్లు చేయడం జరుగుతుందని, సిగ్నల్ వ్యవస్థలను ఏర్పాటు చేసి వాహనాలను నియంత్రించడం జరుగుతుందని తెలిపారు. అనుభవానికి, ప్రమాదానికి సంబంధం లేదని, వాహనం నడిపి సమయంలో ఏకాగ్రతతో నడపాలని తెలిపారు. ప్రతి వాహనానికి సంబంధించి ధ్రువపత్రాలు కలిగి ఉండాలని, రాంగ్ రూట్ లో వాహనం నడపకూడదని తెలిపారు. తనిఖీలలో మద్యం సేవించి వాహనం నడుపుతూ దొరికినట్లైతే సంబంధిత వాహనదారుడి లైసెన్స్ సస్పెండ్ చేయడం జరుగుతుందని, 18 సంవత్సరాల వయసు నిండని వారు వాహనాలు నడపకూడదని, ఒకవేళ నడిపినట్లయితే వారి తల్లితండ్రులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అతివేగం చాలా ప్రమాదమని, వేగం పరిమితిలో ఉండి నిబంధనలు పాటించినట్లయితే గమ్యస్థానానికి సురక్షితంగా చేరుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కొల్లూరులో విశేష నవనీత అలంకరణలో శ్రీ వేంకటేశ్వర స్వామి దర్శనం

**తెల్లాపూర్** కొల్లూరు గ్రామంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తులకు ఆహ్లాదకరమైన ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ప్రత్యేక సందర్భంగా స్వామివారిని నవనీత (వెన్న) అలంకరణతో శోభాయమానంగా అలంకరించగా, ఆ దివ్యరూపం భక్తులను ఎంతో ఆకట్టుకుంది. ఈ విశేష అలంకరణలో స్వామివారి ముఖ కాంతి మరింత ప్రకాశవంతంగా కనిపించడంతో ఆలయానికి వచ్చిన భక్తులు భక్తిశ్రద్ధలతో దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెన్నతో చేసిన ఈ అలంకరణకు ప్రత్యేకమైన ఆధ్యాత్మిక ప్రాధాన్యం ఉందని ఆలయ పూజారులు తెలిపారు. ఉదయం నుంచే ఆలయానికి భక్తుల రద్దీ పెరిగి, స్వామివారి దివ్య దర్శనం పొందారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తి గీతాలతో మారుమోగింది. ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు ముఖ్య పాత్ర పోషించారు. భక్తులు స్వామివారి ఆశీస్సులతో సంతోషంగా తిరిగి వెళ్లారు.

# మున్నూరుకాపు కుల గణన పూర్తి తప్పుల తడక : ఎంపీ రవిచంద్ర

**- కుల జనాభాను తగ్గించిన కుట్రలపై మున్నూరు కాపులు పోరాడాలని పిలుపు.**

**- కోకాపేటలో భవన నిర్మాణాన్ని వేగవంతం చేద్దాం - మున్నూరు కాపుల ఆత్మగౌరవాన్ని నిలబెట్టు కుందాం**



న్యూ ఢిల్లీ:ఏప్రిల్ 18 (తెలంగాణ వాణి) మున్నూరు కాపులను రాజకీయంగా, సామాజికంగా,ఆర్థికంగా అణచివేసేందుకు ప్రభుత్వ స్థాయిలోనే కుట్రలు ప్రారంభ మయ్యాయని,వీటిని తక్షణ మే తిప్పికొట్టకపోతే కుల సమాజ ఉనికికే ప్రమాదం అని అన్ని పార్టీల మున్నూరుకాపు నేతలు స్పష్టం చేశారు.తమ హక్కులను కాపాడుకునేందు కు,తమ మీద జరుగుతున్న అన్యాయాలను ఎదుర్కొనేం దుకు,పార్టీలు భావజాలాలకు అతీతంగా,తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు సమాజ మంతా ఐక్యం కావలసిన అత్యవసర పరిస్థితి తలె త్తిందని రాజకీయంగా,సా మాజికంగా అణచివేయడా నికి,ఆధిపత్య పాలక వర్గాలనుండి,మున్నూరు కాపుల మీద జరుగుతున్న ఉద్దేశపూర్వక దాడులను, వివక్షపూరిత ధోరణులను తీవ్రంగా తిప్పికొట్టాల్సిన సమయం ఆసన్నమైందని కుల పెద్దలు స్పష్టం చేశారు.

ఈ మేరకు బీజేపీ పార్లమెంట రీ బోర్డు సభ్యులు,ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు డాక్టర్ కే.లక్ష్మణ్ పటేల్,కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పటేల్, బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్,రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర పటేల్,పీసీసీ మాజీ అధ్య క్షులు,రాజ్యసభ మాజీ సభ్యులు వీ.హనుమంత రావు పటేల్,కాంగ్రెస్ సీనియర్ నాయకుడు టీపీసీసీ ఉపాధ్యక్షులు గాలి అనిల్ కుమార్ పటేల్ తదితర ప్రముఖులతో మున్నూరు కాపు ఫౌండేషన్ ట్రస్ట్ బాధ్యు లు సమావేశమయ్యారు.కాగా,గత ప్రభుత్వం మున్నూరుకాపు ఆత్మగౌరవ భవన నిర్మాణం కోసం కోకాపేటలో 5,ఎకరాల భూమి కేటాయించిన విషయం తెలిసిందే.మున్నూరుకాపు ఫౌండేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ స్థలంలో ఇప్పటికే నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఆర్థిక వనరులు తదితర సమన్వయలోపాల కారణం గా పనులు ఆలస్యమ వుతున్న నేపథ్యంలో భవన నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు ఫౌండేషన్ ట్రస్ట్ బాధ్యుల ఆధ్వర్యంలో రెండు రోజుల ఢిల్లీ పర్యటన జరిగింది.ఈ సందర్భంగా మున్నూరుకాపు ఆత్మగౌరవ భవన నిర్మాణ పనులను మరింత వేగవంతం చేయ డంతో పాటు,కులం ఎదు ర్కొంటున్న సమస్యల పరిష్కారం గురించి సవివరం గా చర్చించారు.త్వరలో కుల పెద్దలు శ్రేయోభిలాషులు, దాతలు తదితరులతో సమావేశమై భవన నిర్మాణం పనులను వేగవంతం చేయా లని నిర్ణయించారు.అందు కోసం అవసరమయ్యే, వనరుల సమీకరణ సహా అన్ని చర్యలు తీసుకుంటా మని స్పష్టమైన హామీ ఇచ్చారని ఫౌండేషన్ ట్రస్ట్ బాధ్యులు ప్రకటించారు.అదే సందర్భంలో రాష్ట్ర ప్రభుత్వం విడుదలచేసిన కుల జనాభాలో మున్నూరు కాపుల సంఖ్యను అత్యంత తక్కువ చేసి చూపించడం దారుణమని సమావేశం ఆగ్రహం వ్యక్తం చేసింది.మున్నూరు కాపుల జనాభా సంఖ్యను తగ్గించి చూపడం యాదృచ్ఛికంగా జరిగింది కాదని,మున్నూరు కాపులను సామాజికంగా,రాజకీయంగా అణగదొక్కడానికే కుట్ర పూరి తంగా జరిగిన పరిణామమని చర్చ సందర్భంగా కుల పెద్దలు ఆగ్రహం వ్యక్తం చేశారు.కనీస అవగాహన,పరిజ్ఞానం లేకుం డా,వాస్తవాలను గ్రహించ కుండా,పరిగణలోకి తీసుకో కుండా మున్నూరు కాపుల సంఖ్యను తగ్గించి మూడు శాతంగా చూపించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తూ,రాష్ట్ర ప్రభుత్వ చర్యను తీవ్రంగా ఖండించారు.ఇందుకు సంబం ధించి తక్షణమే కార్యాచరణ ప్రణాళికను రూపొందించి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మున్నూరుకాపు సమాజాన్ని ఐక్యం చేసి హక్కులను కాపా డుకునే దిశగా పోరాటాలకు పిలుపునివ్వాలని నిర్ణయిం చారు.హైదరాబాద్ లో సమావేశమై ఇందుకు సంబంధించిన కార్యాచరణను ప్రకటించ నున్నట్లు మున్నూరు కాపు సంఘం,ట్రస్ట్ ఫౌండేషన్ స్పష్టం చేసింది.రెండు రోజుల ఢిల్లీ పర్యటనలో మున్నూరు కాపు ఫౌండేషన్ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి రౌతు కనకయ్య పటేల్,సభ్యులు మంగళారపు లక్ష్మణ్ పటేల్,పన్నాల విష్ణు వర్ధన్ పటేల్,రమేష్ హజారి పటేల్,మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సర్దార్ పుటం పురుషోత్తం రావు పటేల్,నాయకులు ఇసంపల్లి వెంకన్న పటేల్, కాశెట్టి కుమార్ పటేల్ ఆవుల రామారావు పటేల్,వెంగళ రమేష్,ప్రముఖ మ్యూజిషి యన్ సామల వేణు,మహిళా నేతలు కొణతం దీపిక,ఆకుల శ్రీవాణి,తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ వారాన్ని పకడ్బందీగా నిర్వహించాలి

**- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు - హాజరైన జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా**







కరీంనగర్ (తెలంగాణ వాణి ప్రతినిది) ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈ నెల 20 నుంచి 26వ తేదీ వరకు సంక్షేమ వారాన్ని పకడ్బందీగా నిర్వ హించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుంచి ఉన్నతా ధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు,అదనపు కలెక్టర్లు,సంక్షేమ శాఖల అధికారులతో సంక్షేమ వారం నిర్వహణపై సమీక్ష సమావే శం నిర్వహించారు.కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో భాగంగా ఈ నెల 20వ తేదీ నుంచి 26వ తేదీ వరకు ప్రభుత్వ వసతి గృహాలు,గురుకుల పాఠశాల లు,ఆశ్రమ పాఠశాలల్లో షెడ్యూల్డ్ కులములు,షె డ్యూల్డ్ తెగలు,వెనుకబడిన తరగతులు,మైనారిటీ గురుకులాలు, విద్యాలయాలలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని సూచించారు. విద్యార్థులకు క్విజ్,చిత్ర లేఖనం,పెయింటింగ్ పోటీలు నిర్వహించాలని,వసతి గృహాలలో మరమ్మతు పనులను చేపట్టాలని ఆదేశించారు.విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయు లతో సమావేశం నిర్వహించి వసతులపై చర్చించాలని సూచించారు. స్కిల్ డెవల ప్మెంట్ కార్యక్రమాలు చేప ట్టాలని,వేసవి శిబిరం, బడిబాట కార్యక్రమాలు నిర్వహించాలని,రైతు రిజిస్ట్రీ 100 శాతం పూర్తి చేయాలని సీఎస్ సూచించారు.

**అధికారులు ప్రత్యేక కృషి చేయాలి:కలెక్టర్ చిత్రా మిశ్రా**

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా సంక్షేమ వారాన్ని ప్రణాళిక ప్రకారం నిర్వహిద్దామని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్య దర్శి వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా అధికారుల తో శనివారం సాయంత్రం కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ కార్యక్ర మం విజయవంతం చేయడం పై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని రెసిడెన్షియల్ విద్యాలయాలు,హాస్టళ్లకు ప్రత్యేక అధికారులు తమ పరిధిలోని విద్యాలయాల్లో ఈ కార్యక్ర మాన్ని పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలోని ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనారిటీ గురుకులాలు, వసతి గృహాలలో వంటగది, పారిశుధ్యం,మరమ్మతు పనులు చేపట్టాలని సూచిం చారు.విద్యార్థులకు వివిధ విభాగాల్లో పోటీలు నిర్వహిం చాలని స్కిల్ డెవలప్మెంట్, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమావే శాలు ఏర్పాటు చేయాలని తెలిపారు.వేసవి శిబిరాలు, బడిబాట కార్యక్రమాలను జిల్లాలో అధికారుల సమన్వ యంతో పకడ్బందీగా చేపడ దామని పేర్కొన్నారు.రైతుల రిజిస్ట్రీ 100 శాతం పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. సంక్షేమ వారాన్ని కరీంనగర్ జిల్లాలో అత్యద్భుతంగా నిర్వహించి రాష్ట్రంలోని ఆదర్శంగా నిలుద్దామని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే డిపిఓ జగదీశ్వర్ పీడీ హౌసింగ్ శ్రీనివాస్ ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తిరుమలరావు బీసీ సంక్షేమ శాఖ అధికారి అనిల్ ప్రకాష్ డిటిడిఓ సంగీత జిల్లా స్థాయి అధికారులు పాల్గొ న్నారు.

# లివర్ సమస్యలకు ఆల్కహాల్ ఒక్కటే కారణం కాదు

**- లివర్ డే సందర్భంగా మెడికవర్లో అవగాహన సదస్సు**

**కరీంనగర్** లివర్ సమస్యలు కేవలం ఆల్కహాల్‌తోనే వస్తాయనే అపోహ ప్రజల్లో ఉందని ఆల్కహాల్ ఒక్కటే కారణం కాదని అనేక కారణాలతో లివర్ డ్యామేజ్ అవుతుందని మెడికవర్ వైద్యులు అన్నారు.వరల్డ్ లివర్ డేను పురస్కరించుకొని శనివారం కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రిలో వైద్యులు అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ రెగ్యులర్‌గా ఆల్కహాల్ సేవించడం వల్ల స్లోగా లివర్ డ్యామేజ్ అయ్యే ప్రమాదం ఉందన్నారు.కల్తీ ఆహారం,కల్తీ నూనెల కారణంగా కూడా లివర్ డ్యామేజ్ అయ్యే అవకాశం ఎక్కువగా ఉందన్నారు.కోవిడ్ తర్వాత శరీరంలో ఏ చిన్న సమస్య వచ్చినా చాలా మంది వెంటనే పారాసిటమాల్ మాత్రలను ఆశ్రయిస్తున్నారని.తాత్కాలిక ఉపశమనం ఇచ్చే ఈ మందులు,చాలా మందికి రోజువారీ అలవాటుగా మారిపోతున్నాయన్నారు.పారాసిటామల్ డోస్ ఎక్కువైనా లివర్‌పై ప్రభావం చూపుతుందన్నారు.అయితే,వైద్యుల పర్యవేక్షణ లేకుండా దీర్ఘకాలంగా ఏ మందులు వాడినా ఆరోగ్యానికి హానికరమేనని సూచించారు.

నిరంతర అలసట,కండరాల క్రాంప్స్,తల తిరగడం,గుండె దడ,చేతులు లేదా కాళ్లలో మొద్దుబారటం,జుట్టు రాలడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని తెలిపారు.కడుపు ఆరోగ్యాన్ని కాపాడితే.లివర్ ఆరోగ్యాన్ని కూడా కాపాడినట్లే అన్నారు.కొన్ని క్యాన్సర్ల వల్ల కూడా లివర్ డ్యామేజి అయ్యే ప్రమాదం ఉందని,చెట్ల మందులు,పసర్లను నమ్ముకొని ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని పిలుపునిచ్చారు.వ్యాధిని ముందుగా గుర్తిస్తే నివారణ సాధ్యమవు తుందని పేర్కొన్నారు.ప్రస్తుత పరిస్థితుల్లో ఒబెసిటీ కారణంగా ఫ్యాటిలివర్ సమస్యలు ఎక్కువగా పెరుగుతున్నాయని,ఫ్యాటి లివర్‌కు చికిత్స సాధ్యమేనని వెల్లడించారు.శరీరంలో అత్యంత కీలకమైన అవయవముగా లివర్ పనిచేస్తుందని.లివర్‌ను కాపాడుకుంటేనే ఆరోగ్యవంతమైన జీవితం గడపవచ్చన్నారు. మెడికవర్ ఆసుపత్రి సెంటర్‌హెడ్ గుర్రం కిరణ్ ఆద్వర్యంలో జరిగిన.ఈ అవగాహన సదస్సులో ఆసుపత్రి మెడికల్ గ్యాస్ట్రో డాక్టర్ ప్రణీత్,సర్జికల్ గ్యాస్ట్రో డాక్టర్ దిలీప్ రెడ్డి,జనరల్ సర్జన్ డాక్టర్ తాహా,అనెస్తీషియా డాక్టర్ వినయ్,క్రిటికల్ కేర్ డాక్టర్ ఉపేందర్‌రెడ్డి,సూపరింటెండెంట్ డాక్టర్ ప్రియాంక,మార్కెటింగ్ మేనేజర్ కోట కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.

Printed, Published & Owned by JERIPOTHULA SAMPATH, Printed at SRI BALAJI, H.No. 4-4-85, Tilak road, District Karimnagar. 505 001 (T.S)Published at H.No. 3-6-307, Subhash Nagar, Karimnagar MDI: District, Karimnagar -505 001 (T.S) Editor: JERIPOTHULA SAMPATH, RNI NO. APTEL/2012/53127 CELL:9912758107, telanganavanil@gmail.com